J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 47 25.04.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## దేవుళ్ళు.. దేవాలయాల చుట్టూ తిరుగుతున్న రాజకీయాలు

# గుళ్ళలో గోల.. నాయకుల లీల!





కుల వివక్ష, మత విద్వేషాలు, ప్రాంతీయ భావజాలం, అంగబలం, అర్థబలం. ఇప్పటివరకు మన దేశ రాజకీయాల్లో మెయిన్ కంటెంట్ ఇదే. వీటిచుట్టూనే రాజకీయాలు పరిభ్రమించేవి. నాయకుల దృష్టంతా ఈ అంశాలపైనే ఉండేది. కానీ కాలం మారింది. కాదేది కవితకనర్హం అని శ్రీశ్రీ అంటే... కాదేది రాజకీయాలకు అనర్హం అన్నట్లు నేటి తరం రాజకీయ నాయకులు కొత్త పోకడలకు, విష సంస్కృతికి బీజాలు వేస్తున్నారు. ఇందులో భాగంగా రాజకీయాల్లోకి దేవుళ్లను, దేవాలయాలను చొప్పిస్తూ ఆధ్యాత్మిక భావనను, భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు. సున్నితమైన అంశాలను రచ్చకీడుస్తూ రాజకీయపబ్బం గడుపుకుంటున్నారు. ఢిల్లీ నుంచి గల్లీ వరకు ఇదే ధోరణి కనిపిస్తుండడం గమనార్హం. ఇన్నాళ్లూ కాళ్లకు మొక్కులు, భుజాలపై మోతలు, సాష్టాంగ నమస్కారాలతో అధినేతలకు వ్యక్తిపూజ చేస్తూ వారిని రాజకీయ దేవుళ్లుగా చూసే నాయకులు ప్రస్తుతం, నిజమైన దేవుళ్లనే రాజకీయాల్లోకి లాగుతూ నయా పాలిటిక్స్‌కి తెరలేపుతుండడం విశేషం.

## దేశంలో దిగజారుతున్న విలువలు

## రాజకీయ ఆటబొమ్మగా మారుతున్న ఆధ్యాత్మికత

భౌతికంగా కంటికి కనిపించని గాలిని కూడా పోగు చేసి గోలచేయడం, ఉన్నది లేనట్లుగా, లేనిది ఉన్నట్లుగా నమ్మించడం, విద్వేషాలను రెచ్చగొట్టడం నాయకులకు వెన్నతోపెట్టిన విద్య. ఈ క్రమంలో వారు ఎంతకైనా దిగజారుతారు. ఎంతకైనా తెగిస్తారు. అధికారం పరమావధిగా మారుతున్న నేటి రోజుల్లో రాజకీయాల్లో విలువలు అంతకంతకూ పతనమవుతున్నాయి. ఒకప్పుడు పార్లమెంట్ స్థాయిలో ఏ విషయమైనా మెయిన్ కంటెంట్, మెయిన్ పాయింట్ ప్రాతిపదికగా సాగిన రాజకీయాలు నేడు సిల్లీ పాయింట్ గేమ్‌ను తలపిస్తున్నాయి. ఒకప్పుడు ప్రతిపక్షం చేసే విమర్శ సహేతుకమై, ఆలోచింపజేసేదిగా ఉంటే, ప్రస్తుతం సందట్లో సడేమియా అనేలా మారింది. ఊర మాస్‌లో చెప్పాలంటే పాలిటిక్స్ నేలటికెట్ బ్యాచ్ సినిమాగా మారిపోయాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనికి కారణం ఇన్నాళ్లూ కులాల కుంపట్లు, మతాల మంటలు అన్న రీతిలో సాగిన

2లో

## నరమేధం సృష్టించిన

# నరకాసురులు.. నరరూప రాక్షసులు!



- పేట్రేగిపోతున్న పాపి(కి)స్థాన్ ఉగ్రవాదులు
- కశ్మీర్ ఉగ్రదాడితో మరోమారు మారణహోమం
- తగిన శాస్తి చేస్తామంటున్న భారత ప్రభుత్వం

మాటలకందని విషాదం. ఊహకందని ఘోరం. కశ్మీర్ సరిహద్దుల్లో ఇన్నాళ్లూ నివురుగప్పిన నిప్పులా ఉన్న ఉగ్రభూతం ఒక్కసారిగా బుసలుకొట్టింది. అమాయక ప్రజలను నిలువునా పొట్టనపెట్టుకుంది. కశ్మీర్ లోయలో అత్యంత సుందర ప్రదేశంగా, మినీ స్విట్జర్‌ల్యాండ్‌గా పేరుగాంచిన పహల్గాంలో పాకిస్థాన్ ముష్కర మూకలు రెచ్చిపోయాయి.

370 ఆర్టికల్ రద్దు తర్వాత ప్రశాంతంగా ఎన్నికలు జరుపుకుని అభివృద్ధి వైపు అడుగువేస్తున్న కశ్మీర్‌ను చూసి జీర్ణించుకోలేని పాక్‌సైన్యం పోషించే పెంపుడు కుక్కలు అన్నెంపుణ్యం ఎరుగని అమాయకుల జీవితాలను నిర్ధయగా చిదిమేశాయి. వేసవిలో ఆహ్లాదం కోసం, ప్రకృతి రమణీయతను ఆస్వాదించడం కోసం, చల్లదనంలో సేదతీరడం కోసం వెళ్లిన పర్యాటకులపై టెర్రరిస్టులు పాశవికంగా దాడి చేశారు. ఏకంగా 28 మందిని పొట్టనపెట్టుకున్నారు. ఈ క్రమంలో కుటుంబసభ్యుల నుంచి మగవారిని వేరుచేసి ముస్లిం అయితే వదిలేస్తాం, హిందూవైతే చిదిమేస్తాం అంటూ పేర్లడిగి, అప్పటికీ నమ్మకం కుదరకపోతే బహిరంగంగా బట్టలు విప్పించి, సున్తి చేసుకున్నారా లేదా అని పరీక్షించి, ఇంకా నమ్మకం కుదరకుంటే నమాజ్ చేయమంటూ వేధించి, చేయకుంటే వెంటాడి, వేటాడి పాయింట్ బ్లాంక్‌లో గన్‌పెట్టి ప్రాణాలను హరించారు. పైగా "మా ఇంటి పెద్దదిక్కును పొట్టనపెట్టుకుంటున్నారు, మేమేం పాపం చేశాం. మమ్మల్ని కూడా చంపేయండి" అని బాధితులు ఆక్రోశిస్తే.. "మీరెళ్లి ఇక్కడ జరిగిందంతా మీ మోడీకి చెప్పుకోండి. మా సత్తా ఏంటో మీ నాయకుడికి వివరించండి" అంటూ ముష్కరులు వ్యాఖ్యానించడం వారిలోని మృగత్వానికి, పశుతత్వానికి పరాకాష్టగా కనిపిస్తోంది.

### దాడి జరిగిందిలా..

ఈనెల 22వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో కశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా

..10లో






# గుళ్ళలో గోల.. నాయకుల లీల!

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయాలు ప్రస్తుతం భక్తిభావం చుట్టూ ఆధ్యాత్మికత కేంద్రంగా సాగుతుండడమే.

## జాతీయ పార్టీలు తలోదారి..

ఎవరు అవునన్నా, కాదన్నా, బీజేపీ ఓ మతం భావజాలంతో, ఓ వర్గం ఎమోషన్స్‌తో రాజకీయాలు నడుపుతోందన్నది జగమెరిగిన సత్యం.దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం లౌకికతత్వం పేరుతో మెజారిటీ ప్రజల మనోభావాలను ఏళ్లపాటు చిదిమేసిందని, అందుకే కొందరు మైనారిటీ వర్గ నాయకులు అడ్డగోలుగా రెచ్చిపోతున్నారన్నది ఆ పార్టీ ఆరోపణ. ఇదే తరుణంలో మెజారిటీ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నిలిపేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని బీజేపీ నాయకులు బహిరంగంగానే ప్రకటిస్తుంటారు. ఈ క్రమంలోనే అయోధ్య రామమందిర నిర్మాణం తమ జీవితకాల లక్ష్యం అని మేనిఫెస్టోలోనే వెల్లడించారు. ఇక వక్ఫ్ సవరణ చట్టం కూడా ఇందులో భాగంగానే తీసుకొచ్చిందనే వాదనలూ ఉన్నాయి. వక్ఫ్‌బోర్డు పేరుతో ఓ వర్గం నాయకులు ప్రభుత్వ భూములను అప్పనంగా కొట్టేయడమే కాకుండా వాటిని తమ సొంతానికి వినియోగించుకుంటూ దేశానికి తీరని నష్టం కలిగిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఈ సమయంలోనే మైనారిటీల ఓట్ల కోసం కాంగ్రెస్ సహా కొన్ని ప్రాంతీయ పక్షాలు వక్ఫ్ సవరణ చట్టాన్ని గుడ్డిగా వ్యతిరేకిస్తున్నాయని అమిత్‌షా, నడ్డా వంటి నాయకులు సైతం విమర్శిస్తుండడం గమనార్హం. ఇక కాంగ్రెస్ అగ్ర నాయకత్వం బీజేపీది ఒంటెత్తుపోకడ అంటూ మండిపడుతోంది.

## ఆంధ్రప్రదేశ్‌లో పిచ్చి పీక్స్..

ఆధ్యాత్మికతను పాలిటిక్స్‌లోకి తీసుకురావడం, దేవాలయాలు, చర్చిలు, మసీదులను రాజకీయ స్వార్థానికి వాడుకోవడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరిపాటిగా మారింది. ఇందులో ఆ పార్టీ ఈ పార్టీ అన్న తేడా కూడా కనిపించడం లేదు. ఎందుకంటే ప్రపంచంలో భక్తుల పరంగా, ఆదాయపరంగా అగ్రభాగాన ఉండే తిరుమలను సైతం ప్రస్తుతం రాజకీయాలకు కేంద్రంగా అధికార ప్రతిపక్ష పార్టీలు వాడుకుంటుండడమే ఇందుకు నిదర్శనంగా కనిపిస్తోంది. కలియుగ వైకుంఠంగా ప్రసిద్ధిచెంది కోట్లాదిమంది మనోభావాలతో ముడిపడిన తిరుమలలో కూడా గత కొంత కాలంగా సంప్రదాయాలను పట్టించుకోకుండా, భక్తుల నమ్మకాలకు, విశ్వాసాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా, పరమపవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదం వంటి సున్నితమైన అంశాల్లో సైతం రాజకీయాలు చొరబడి వ్యవస్థను భ్రష్టుపట్టిస్తుండడం ఇందుకు ఉదాహరణగా కనిపిస్తోంది. లడ్డూ తయారీలో కల్తీ, వాటిలో యానిమల్, వెజిటెబుల్ ఫ్యాట్ కలిసిందనే ఆరోపణలు రావడం వాటిని పాలక, ప్రతిపక్షాలు తమ రాజకీయ మనుగడ కోసం ఇష్టారాజ్యంగా వాడుకోవడం అత్యంత శోచనీయం. చివరికి కోర్టులు జోక్యం చేసుకుని వాటిపై విచారణ కమిషన్లు వేయడం, వాటి దర్యాప్తులోనూ రాజకీయ నాయకులు జొరబడి తమ వాదనలను, తమ భావాలను ప్రతిబింబించే విధంగా నివేదిక రూపొందించాలని బలవంతం చేస్తున్నారనే ఆరోపణలు రావడం దిగజారుతున్న రాజకీయ విలువలకు అద్దం పడుతోంది. ఇక సాక్షాత్తూ శ్రీవారికి అంకితమైన తిరుమలలో కొన్ని మఠాలు అవతరించి భూములను అప్పనంగా కొట్టేయడం, వాటిలో భారీ భవంతులు నిర్మించడం పతనావస్థకు పరాకాష్టగా నిలుస్తోంది. విశాఖలోని శారదా పీఠం నిర్వాహకులు స్వరూపనందేంద్ర సరస్వతి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అగ్ర నాయకత్వంతో గత ఐదేళ్లు చెట్టాపట్టాలేసుకుని తిరిగారనడం జగ(న్)మెరిగిన సత్యం. ఈ క్రమంలోనే తిరుమల గోగర్భం ప్రాంతంలో భారీగా విశాఖ శారదాపీఠానికి జగన్ ప్రభుత్వం భూమిలివ్వడం ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ అనుమతులను రద్దు చేయడం కనిపిస్తోంది. ఇదే సమయంలో భీమిలి, పెందుర్తిలో కోట్ల విలువైన భూములను శారదాపీఠం నిర్వాహకులు నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆక్రమించారనే ఆరోపణలు కూడా వెల్లువెత్తడం గమనార్హం. ఇలా భగవత్ తత్వాన్ని, భక్తిభావాన్ని ప్రశాంతతను పెంపొందించాల్సిన ఆధ్యాత్మిక పీఠాలు, మఠాలు సైతం తమ స్వార్థంకోసం రాజకీయ కేంద్రాలుగా మారడం, విమర్శలు ఎదుర్కోవడం మనదేశం తాలూకు దౌర్భాగ్యం అనడంలో సందేహం లేదు.

## తిలాపాపం తలాపిడికెడు..

గుళ్లను, చర్చిలను, మసీదులను రాజకీయ్యాల్లోకి లాగడంలో అన్ని పార్టీలూ మాకుమేమే..మీకు మీరే సాటి అన్నట్లుగా సాగుతున్నాయడనంలో ఎలాంటి సందేహం లేదు. 2014 నుంచి 2019 వరకు పరిపాలించిన తెలుగుదేశం ప్రభుత్వంలో కృష్ణా పుష్కరాలను కారణంగా చూపి విజయవాడలో కొన్ని ఆలయాలను తొలగించడం, గోదావరి పుష్కరాల్లో తొక్కిసలాట జరిగి భక్తులు మరణించడం గతంలో పెద్దవివాదానికే దారితీసింది.

ఇక తిరుమల వెంకన్న పింక్‌డైమండ్ మాయం చేశారంటూ అప్పట్లో ఎంపీ విజయసాయిరెడ్డి ఏకంగా చంద్రబాబు, లోకేష్‌నే టార్గెట్ చేసి అడ్డగోలు విమర్శలు చేయడం తెలిసిందే. అలాగే 2019 నుంచి 2024 వరకు పాలించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పేరిట, రోడ్ల విస్తరణ పేరిట హిందూ విగ్రహాలను తొలగించడం రచ్చరచ్చగా మారింది. తిరుమల శ్రీవారి ఆలయం, శ్రీశైల మల్లిఖార్జునస్వామి ఆలయం, అన్నవరం సత్యనారాణస్వామి ఆలయంలో అన్యమత ప్రచారం, అన్యమతస్తులకు దుకాణాల కేటాయింపు వ్యవహారం కూడా విమర్శలపాలైంది. ఇక తూర్పుగోదావరి జిల్లాలో అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రథం దగ్ధంకావడం, ఈ వ్యవహారం చినికిచినికి గాలివానగా మారి సీబీఐ విచారణ వరకు వెళ్లడం తెలిసిందే. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో వెండి సింహాలు మాయం, నిడమనూరులో బాబా విగ్రహం ధ్వంసం, అయోధ్యరామమందిర నిర్మాణ భూమిపూజను ఎస్వీబీసీలో ప్రత్యక్షప్రసారం చేయకపోవడం, సాక్షాత్తూ ఎస్వీబీసీ ఛైర్మెన్ పృథ్వీరాజ్ లైంగిక ఆరోపణలతో రాజీనామా చేయడం రాజకీయ రచ్చకు వేదికగా మారాయి. ఇక టీటీడీ టికెట్లపై అన్యమత ప్రచారం, టీటీడీ డైరీల ముద్రణలో లోపాలు, తిరుమల పర్యటనలో జగన్ డిక్లరేషన్‌పై సంతకం చేయకపోవడం, సతీసమేతంగా శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించకపోవడం వివాదాస్పదమయ్యాయి. చివరికి వినాయక చవితికి ఏర్పాటు చేసే మంటపాలపై కూడా ఆంక్షలు విధించడం, ఊరేగింపులను అడ్డుకోవడం అప్పట్లో రాజకీయరంగును పులుముకుంది. ఇక 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై న్యాయవిచారణకు ఆదేశించి ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని ప్రకటించింది.

అయితే వైకుంఠ ఏకాదశి రోజున తొక్కిసలాట జరిగి భక్తులు మరణించడంతో డిఫెన్స్‌లో పడిపోయింది. దీనికి కొనసాగింపుగా తిరుమల ఆలయ మాడవీధుల్లో మద్యం, మాంసం పట్టుబడడం, కొండపై శివా అనే డ్రైవర్ హత్యకు గురైనట్లు ఆరోపణలు రావడం, శ్రీవారి ఆలయంపై డ్రోన్ కెమెరాలు ఎగరడం, తాజాగా టీటీడీ గోశాలలో పశువులు మరణించాయనే అంశం వివాదాస్పదం కావడంతో ప్రభుత్వంపై ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శల వర్షం కురిపించారు. ధర్నాలు, నిరసనలకు పిలుపునిచ్చారు. ఇదే సమయంలో తెలుగుదేశం ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు కూడా రంగంలోకి దిగి, చిన్న చిన్న విషయాలను ప్రతిపక్షం భూతద్దంలో చూపించి భక్తుల మనోభావాలను దెబ్బతీస్తోందంటూ ఎదురుదాడికి దిగడంతో తిరుపతి నగరం రణరంగాన్ని తలపించింది. ఏదేమైనా సున్నితమైన కోట్లాది మంది మనోభావాలను ప్రభావితం చేసే ఆధ్యాత్మిక అంశాలపై రాజకీయాలు చేయడం, నేటి కాలం నాయకుల సంకుచిత మనస్తత్వాన్ని తెలియజేస్తుందనడంలో సందేహం లేదు. ఇక ఇదే సమయంలో పాస్టర్ ప్రవీణ్ హత్య కూడా రాజకీయపార్టీల గగ్గోలుకు మూల వస్తువుగా మారినట్లు కనిపిస్తోంది. కొందరు పాస్టర్ ప్రవీణ్‌ది ప్రమాదం అని, మరికొందరు హత్య అంటూ రోడ్డుకెక్కడం దీనికి నిదర్శనంగా కనిపిస్తోంది. ఆందోళనకారులను కొన్ని పార్టీలు వెనుకనుండి ప్రోత్సహించడం దిగజారుడుతనానికి పరాకాష్టగా చెప్పుకోవచ్చు. ఇకనైనా ఇలాంటి దుస్సంప్రదాయాలకు తిలోదకాలిచ్చి రాజకీయాలను రాజకీయాలుగా, భక్తిభావాన్ని భక్తిభావంగా, ఆధ్యాత్మికతను ఆధ్యాత్మిక కోణంలో మాత్రమే చూడడం సహేతుకం. ప్రజల భవిష్యత్‌కి శ్రేయస్కరం. ఈ విషయాన్ని రాజకీయ నాయకులు ఇప్పటికైనా గ్రహించాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు, పండితులు సూచిస్తున్నారు. ఒక్కమాట మాత్రం నిజం దేవుడిని అడ్డం పెట్టుకుని చేస్తున్న రాజకీయాల్లో ఎంత నిజముందో, ఎంత నైతికత ఉందో ఆ దేవుడికే ఎరుక అనడంలో సందేహం లేదు. రాజకీయ నాయకులారా!.. దేవుడు అంతా చూస్తున్నాడు, ఈ విషయంలో తస్మాత్ జాగ్రత్త..!



# దివికేగిన.. సింహపురి సాహితీ దిగ్గజం

## 'పద్యకళా నిధి'.. ఎంఆర్ ప్రసాద్.. అస్తమయం!

***సింహపురి సాహితీ దిగ్గజం, 'పద్యకళా నిధి' బిరుదాంకితులు, నెల్లూరు విఆర్ కళాశాల విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు.. మెట్టు రామచంద్రప్రసాద్..ఇక లేరు. అనారోగ్యంతో చెన్నైలో చికిత్సపొందుతూ ఈనెల 22వ తేదీ మంగళవారం తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 82 సంవత్సరాలు. ఆయన సతీమణి పేరు పరమేశ్వరమ్మ. వీరికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్దకుమారుడు శివకుమార్ స్వర్గస్థులు. రెండవ కుమారుడు జయశంకర్, మూడవ కుమారుడి పేరు శ్రీధర్‌బాబు. కుమార్తె పేరు స్వరాజ్యలక్ష్మి. ఈమె కూతురే శివగామిని. మనవరాలి పేరుతోనే రామచంద్రప్రసాద్ 'శివగామిని' పద్యకావ్యాన్ని రచించడం విశేషం. ఏదేమైనా, ఆయన మరణంతో నెల్లూరు ఒక పద్యసాహితీవేత్తను..కవితా యోధుడిని కోల్పోయినట్లయింది.***

నెల్లూరు టౌన్‌హాల్‌లో ఏ సాహితీ సభ జరిగినా, సరస్వతి సమాజంలో ఏ సాంస్కృతిక కార్యక్రమం ఉన్నా.. తప్పకుండా అందరిలో ఒకరిగా హాజరయ్యేవారిలో ఆయనొకరు. అనేక సభలకు తానే పెద్ద అయినా, వేదిక మీద తాను మాట్లాడేదానికంటే, ఇతరుల మాటలు వినేందుకే ఆసక్తి చూపే అరుదైన వక్తల్లో ఆయనొకరు. ఆయనే.. ఎంఆర్ ప్రసాద్ అనబడే మెట్టు రామచంద్ర ప్రసాద్. నెల్లూరు విఆర్ కళాశాల ఆంధ్రోపన్యాసకునిగా, తెలుగు భాషా వికాసానికి కృషిచేసిన భాషాభిమానిగా, ప్రత్యేకించి పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుకి గురువుగా కూడా ఆయన అందరికీ సుపరిచితులు. విలక్షణమైన పద్యకావ్యం..'శివగామిని' కావ్యకర్తగా పద్యకవితాలోకంలో ఆయన ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. పద్యానికి ఆదరణ తగ్గిపోతున్న నేటికాలంలో..పద్యకవిత్వానికి పూర్వవైభవం తేవాలని తపించారు. జీవిత చరమాంకంలో కూడా మొక్కవోని దీక్షతో నెల్లూరులో 'పద్య కళాపరిషత్' స్థాపించి పద్యకవులను ప్రోత్సహించారు. అంతే కాదు, ఎన్నో సాహితీ, కళా సంఘాలకు ఆయన అండదండగా నిలిచారు.

### జీవిత ప్రస్థానం :

19-6-1943లో నెల్లూరులో పుణ్య దంపతులు మెట్టు వెంకట నరసింహం, కనకమ్మలకు రామచంద్రప్రసాద్ జన్మించారు. నెల్లూరు ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని ప్రాథమిక పాఠశాలల్లో అక్షరాభ్యాసం ప్రారంభించి, తెలుగును బాగా నేర్చుకోవాలనే ఆసక్తితో తన మేనత్త ఊరైన ఈదూరుకు వెళ్ళి, అక్కడి వీధిబడిలో చదువుకున్నారు. అక్కడే ఆయనకు తెలుగు సారస్వతం మీద అభిమానం కలిగింది. అక్కడినుంచి నెల్లూరులోని ఆర్ఎస్ఆర్ఎం హైస్కూలులో చేరి తన ప్రతిభకు మెరుగులు దిద్దుకున్నారు. ఆ తర్వాత విఆర్ కాలేజీలో చదువుకుని, ఉన్నత విద్య కోసం తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో చేరారు. ఉపాధ్యాయ ఉద్యోగం వచ్చాక నెల్లూరుజిల్లాలోని వరికుంటపాడులో అయ్యవారిగా బెత్తం పట్టుకున్నారు. అ తర్వాత నెల్లూరు విఆర్ కాలేజీలో తెలుగు అధ్యాపకునిగా దీర్ఘ కాలం పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు.

### 'శివగామిని' కావ్యకర్తగా...

అధ్యాపకునిగా ఉంటూనే.. సాహిత్యంపై మక్కువతో ఆయన పలు రచనలు చేశారు. ఆయన రచనా ప్రతిభకు ప్రతీకగా నిలిచిన 'శివగామిని' కావ్యం మరింతగా పాఠకాదరణ పొందింది. పద్యానికి ఆదరణ తగ్గిపోతున్న నేటికాలంలో, పద్యాన్ని నిలబెట్టాలనే ధ్యేయంతో ఆయన కొంతకాలం క్రితం 'పద్య కళా పరిషత్' ఏర్పాటుచేసి ఎన్నో సాహితీ కార్యక్రమాలు నిర్వహించారు. ఆధ్యాత్మిక సేవలో భాగంగా ఇనమడుగులోని శ్రీ సత్యానందాశ్రమానికి ప్రధాన సలహాదారుగా కూడా ఉన్నారు.

ఏదేమైనా, వక్తగా.. మంచి వ్యక్తిగా.. పద్యకవిగా సాహితీ రంగానికి గర్వకారణమైన సేవలందించిన మెట్టు రామచంద్రప్రసాద్ గారి ఆత్మకి సద్గతి కలగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తోంది.. 'లాయర్'!..

### మా తెలుగు మాస్టారు..మాకెంతో ఆత్మీయులు!

**- పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**



సాహితీయోధుడు..విఆర్ కళాశాలలో తనకు గురువైన మెట్టు రామచంద్రప్రసాద్ మృతి పట్ల భారతదేశ పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు బాధను వ్యక్తం చేశారు. 'అభినవ తిక్కన'గా ప్రసిద్ధులైన మా తెలుగు మాస్టారు.. ఆత్మీయులు మెట్టు రామచంద్రప్రసాద్ గారు పరమపదించడం అత్యంత విచారకరం. శ్రీ పోలూరు హనుమజ్జానకీరామశర్మగారి పేరిట తెలంగాణ సారస్వత పరిషత్ ఏర్పాటు చేసిన అవార్డును, ఆయనకు అందజేసిన జ్ఞాపకాల నుంచి బయటపడకముందే వారు దూరం కావడం బాధాకరం' అని ఆవేదన చెందారు.

'శ్రీ మెట్టు రామచంద్రప్రసాద్ గారి వ్యక్తిత్వం విలక్షణమైనది. పద్యకళాపరిషత్ అధ్యక్షులుగా తెలుగుభాషా వికాసానికి వారు చేసిన కృషి, ఎంతోమంది కళాకారులు..సాహితీవేత్తలకు అందించిన సహకారం ఉన్నతమైనవి. నేను చదువుకునే రోజుల్లో కూడా ఎంతో మంది విద్యార్థులను వారు తీర్చిదిద్దిన తీరు మరువలేనిది. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, వారి కుటుంబసభ్యులకు, శిష్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను'..అని వెంకయ్య తన సంతాపసందేశంలో పేర్కొన్నారు.

# సత్తాచాటిన.. 'విపిఆర్ విద్య' విద్యార్థులు


- 10వ తరగతిలో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత
- నిరుపేద విద్యార్థిని గాయత్రికి 587 మార్కులు

నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మానసపుత్రిక, విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నడుస్తున్న 'విపిఆర్ విద్య' పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. బుధవారం విడుదల చేసిన ఫలితాల్లో, విపిఆర్ విద్య పాఠశాల విద్యార్థులు 100కి 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. అందులో పి.గాయత్రి అనే విద్యార్థిని 600 మార్కులకుగాను 587 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలవడం విశేషం. అదే విధంగా, వి.వైష్ణవి 584మార్కులు, వి.వర్ష 581 మార్కులు సాధించారు. పదో తరగతిలో ఫలితాల్లో మొత్తం 29 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా..29 మంది ఉత్తీర్ణత సాధించారు. వారిలో 27 మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించడం హర్షదాయకమంటూ పాఠశాల వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

## అన్ని సదుపాయాలు ఉచితమే...

నిరుపేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఉన్నత విద్యను అందించేందుకు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కనుపర్తిపాడులో, విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2016లో 'వి.పి.ఆర్ విద్య' పాఠశాలను ఏర్పాటుచేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తూ వస్తున్నారు. పాఠశాలలో చదివే నిరుపేద పిల్లలకు అన్ని సదుపాయాలను ఉచితంగానే అందిస్తున్నారు. ప్రతి ఒక్క విద్యార్థికి స్కూల్ యూనిఫాం, పుస్తకాలు, షూస్, బ్యాగ్స్, ఇతర వస్తువులు అన్నీ ఉచితంగానే ఇస్తున్నారు. పరిశుభ్రమైన వాతావరణంలో వండిన పోషకాహారంతో పిల్లలకు మధ్యాహ్నం ఉచితంగా భోజనం పెడుతున్నారు. ఆర్వో వాటర్ ప్లాంట్ ద్వారా స్వచ్ఛమైన తాగు నీరును విద్యార్థులకు అందజేయడమే కాక, పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కూడా కల్పిస్తున్నారు.

## గాయత్రిని ఉన్నత చదువులు చదివిస్తాం -ప్రశాంతిరెడ్డి



విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నడుస్తున్న తమ 'విపిఆర్ విద్య' పాఠశాలలో చదువుకుంటూ, టెన్త్‌లో 600కు గాను 587 మార్కులు సాధించి అగ్రశ్రేణిలో నిలిచిన నిరుపేద విద్యార్థిని గాయత్రిని విపిఆర్ సతీమణి.. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అభినందించారు. గురువారం నెల్లూరులోని విపిఆర్ నివాసానికి వచ్చిన ఆ విద్యార్థినిని చూసి సంతోషిస్తూ, ఆ విద్యార్థిని ఉన్నత చదువులకు అయ్యే ఖర్చును తాము భరిస్తామని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆమె ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ వి.టి శ్రీనివాస్, విద్యార్థిని తల్లి ఝాన్సి తదితరులు పాల్గొన్నారు. 'విపిఆర్ విద్య'లో చదువుకుంటూ, వేమిరెడ్డి దంపతుల సహకారంతో తమ కుమార్తె మంచి ఫలితాలు సాధించిందని, వారికి తాము జీవితాంతం రుణపడి ఉంటామని గాయత్రి తల్లి ఝాన్సీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీసిటీ ప్రగతి అభినందనీయం

### - 'డైకిన్ ఇండస్ట్రీస్' గ్లోబల్ ప్రెసిడెంట్ ప్రశంస -



డైకిన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ప్రెసిడెంట్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నౌఫుమీ టకేనాక ఇటీవల శ్రీసిటీలోని డైకిన్ ఇండియా తయారీ కేంద్రాన్ని సందర్శించారు. డైకిన్ ఇండియా ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ కె.జె.జావా ఆయనకు ఆహ్వానం పలికారు. ప్లాంట్ పనితీరుపై సమీక్ష జరిపిన తర్వాత.. ప్లాంట్ నిర్వహణ, సాంకేతిక నైపుణ్యం, దీర్ఘకాలిక విస్తరణ ప్రణాళిక తదితర అంశాల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం, వారితో శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సమావేశమయ్యారు. గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా శ్రీసిటీ ఎదుగుదలను రవీంద్ర సన్నారెడ్డి ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. ముఖ్యంగా ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, సుస్థిరత ద్వారా ఈ ప్రాంతం యొక్క పారిశ్రామిక వృద్ధికి డైకిన్ అందించిన గణనీయమైన సహకారాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ పెట్టుబడిదారుల అనుకూల పర్యావరణ వ్యవస్థ సంతృప్తికరంగా ఉన్నాయంటూ టకేనాక ప్రశంసించారు. శ్రీసిటీ పారిశ్రామికవాడ స్థాయి, సామర్థ్యం, ఆధునిక మౌళిక సదుపాయాలను కూడా ఆయన కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు శ్రీసిటీ బృందం అందిస్తున్న సహాయసహకారాల పట్ల స్పందించిన ఆయన, శ్రీసిటీలో మరింత విస్తరించడానికి డైకిన్‌కి ప్రణాళికలున్నాయని తెలిపారు. ఈ పర్యటన పట్ల టకేనాకకు కృతజ్ఞతలు తెలిపిన డాక్టర్ సన్నారెడ్డి, ఏసీ కంప్రెషర్‌లను ఉత్పత్తి చేయడానికి తైవాన్‌కు చెందిన రెచీ సంస్థ భాగస్వామ్యంతో డైకిన్ ఏర్పాటు చేస్తున్న నూతన తయారీ కేంద్రం, దేశంలో ఏసీ తయారీ హబ్‌గా ఎదగాలన్న శ్రీసిటీ లక్ష్యానికి మరింత బలాన్ని చేకూరుస్తోందన్నారు. మంచి పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను పెంపొందించాలన్న శ్రీసిటీ దృష్టికి సరితూగేలా సాంకేతిక, స్థానిక అభివృద్ధి ప్రాధాన్యతతో డైకిన్ పయనిస్తోందన్నారు.


## ప్రథమ వర్ధంతి



సేవాస్ఫూర్తి, ఆత్మీయ దీప్తి, మా నాన్న

**జక్కా శ్రీనివాసులు రెడ్డి గారు**

భౌతికంగా మాకు దూరమై ఏడాది గడుస్తోంది.

ఆ మానవీయ మహితాత్మకి నివాళులు
అర్పించడానికి మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాం.

మీ ఆగమనం మాకు అపురూపం.

తేది : గురువారం 1 మే 2025
సమయం : ఉదయం 11 గంటల నుండి
వేదిక : మనుబోలు గ్రామం, నెల్లూరుజిల్లా
పంక్తి : 12 గంటలకి

నిర్యాణం : 01.05.2024

కుమార్తె
రాధిక రెడ్డి సామంతు

కుమారుడు
భక్తవత్సల రెడ్డి జక్కా

అల్లుడు
శ్రీరామ్ రెడ్డి సామంతు

కోడలు
హరిత రెడ్డి జక్కా

లాయర్
ఏప్రిల్ 25, 2025

# కశ్మీర్‌లో ఘోర కలి!..ఉగ్రతూటాలకు పర్యాటకులు బలి!

అందాల లోయ.. కశ్మీర్‌లో మళ్ళీ ఉగ్రోన్మాదులు రెచ్చిపోయారు. అమర్‌నాథ్ యాత్రకోసం దేశవ్యాప్తంగా ఎక్కడెక్కడి నుంచో వచ్చిన అమాయక పర్యాటకులపై ఒక్కసారిగా తూటాల వర్షం కురిపించి తమ కర్కశత్వం ప్రదర్శించారు. నిస్సహాయులను చుట్టుముట్టి కాల్చిపారేసి తమ పైశాచికత్వం చాటుకున్నారు. ఈ దుర్ఘటనలో ఇద్దరు విదేశీయులతో సహా 28 మంది ప్రాణాలు కోల్పోవడం ఘోరం.. దారుణం.. అత్యంత బాధాకరం. వారే కాక, మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు కూడా. దీంతో మృతుల సంఖ్య ఇంకా పెరగ వచ్చని భావిస్తున్నారు. ఈ ఉగ్ర సంఘటనతో కాశ్మీర్‌లోయ అట్టుడికిపోతోంది.

కొండలు లోయలు వనాలతో అలరారుతుండే జమ్ము కశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా పెహల్గాం ప్రాంతం..ఉగ్రవాద రాకాసులకు అడ్డాగా మారిపోయింది. గత కొంతకాలంగా పొంచిఉన్న ఉగ్రవాదులు ఒక్కసారిగా విరుచుకుపడి, అభం శుభం తెలియని సందర్శకులపై పంజా విసిరారు. ఊహించని ఈ నరమేధానికి పెహల్గావ్ వణికిపోయింది. నవ్వుతూ సరదాగా గడుపుతున్న పర్యాటకుల గుండెల్లో తూటాలు పేల్చి..ఆ ప్రాంతాన్నంతా నెత్తుటేరుగా మార్చి వికటాట్టహాసం చేస్తూ పారిపోయారు ఉగ్రవాద ముష్కరులు. ఇప్పుడే కాదు, గతంలో కూడా ఉగ్రవాదులు అమర్‌నాథ్ యాత్రికులను, కశ్మీర్ పండితులను, దేశభద్రతే ప్రాణప్రదంగా భావించే సైనికులను, భద్రతాదళాలను, సిఆర్‌ఎఫ్ అధికారులను, చివరికి ఏ పాపం తెలియని సాధారణ పౌరులను కూడా ఎంతోమందిని పొట్టనపెట్టుకున్నారు. ఉగ్రవాదులంటే మరెవరో కాదు. నరరూప రాక్షసులని, మానవశరీరంతో ఉన్న భయంకర విషసర్పాలని, మానవత్వం అన్నది వారికి ఏ కోశానా ఉండదని అందరికీ తెలిసిందే. అందరూ ఆదమరచి వున్న వేళ.. అదను చూసుకుని ఉగ్రవాదులు మళ్ళీ తాజాగా పంజా విసిరారు. 2019 ఫిబ్రవరి 14న సైనికుల కాన్వాయ్‌పై ముష్కరుల మానవబాంబు దాడితో44 మంది దుర్మరణం పాలైన సంఘటన తర్వాత, కేంద్రం మరింత కఠినచర్యలు ప్రారంభించడంతో ఉగ్రవాదులు ఏ కలుగుల్లోకో వెళ్ళి దాక్కున్నారు. ఉగ్రవాదుల చేతుల్లో పడి జమ్ము-కశ్మీర్ గతంలో అగ్నిగుండంగా మారివున్న నేపథ్యంలో మోడీ అధికారంలోకి వచ్చాక ఆర్టికల్-370ని నిర్వీర్యం చేయడంతో జమ్ము-కశ్మీర్‌లలో శాంతి సుమాలు వికసించడం ప్రారంభించాయి. జమ్ము-కశ్మీర్ విడిపోవడం, లడ్డాక్ కేంద్రపాలిత ప్రాంతంగా ఏర్పడడం జరిగాయి. ఆ తర్వాత కశ్మీర్‌లో ప్రజాస్వామ్యబద్ధమైన ప్రభుత్వం ఏర్పాటుకావడం, ఇటీవలే పర్యాటక రంగంలో కూడా ముందడుగు వేయడం జరుగుతోంది. వీటిని సహించలేక ఉగ్రవాదులు మళ్ళీ పెట్రేగిపోతున్నారు. పెహల్గావ్ పక్కనే ఉన్న అడవిలోంచి నలుగురు దుండగులు ఒక్కసారిగా తుపాకులతో దూసుకువచ్చి పర్యాటకుల బేస్‌క్యాంప్‌మీద మూకుమ్మడిగా కాల్పులు జరపడం, దొరికినవారిని దొరికినట్లు కాల్చి చంపడం అమానుషం. ఆ నరమేధం ప్రపంచ ప్రజలను సైతం కంటతడి పెట్టిస్తోంది. సైనిక దుస్తుల్లో ఉన్న ఆ దుండగులను చూసి పర్యాటకులు వారు తమ భద్రతకే వస్తున్నారనుకున్నారు కానీ, వారే తమని భక్షిస్తారని అనుకోలేదు. తెలుసుకునేలోపలే 28 మంది రక్తపు మడుగుల్లో విలవిల్లాడుతూ ప్రాణాలు వదిలారు. కొందరిని గుండెలపైనా, తలలపైనా కాల్చారు. మరికొందరిని చెవుల వద్ద, వీపుల మీదా తుపాకీపెట్టి పేల్చారు. తీవ్రగాయాలు తగిలి ఆర్తనాదాలతో గుండెలవిసేలా బాధితులు అల్లాడుతుంటే.. ఆ ప్రాంతమంతా నెత్తురు ఏరులై పారుతుంటే.. ఆ ముష్కరమూకలు పిశాచాల్లా నవ్వుకుంటూ వెళ్ళిపోయారంటే వారి నీచమైన ప్రవృత్తి ఎంతటి ఘోరమైనదో అర్థమవుతుంది. ప్రత్యేకించి హిందువులనే లక్ష్యంగా చేసుకొని ఈ మారణహోమానికి పాల్పడ్డారు. అంతేకాదు, ఇటీవలే పెళ్లిచేసుకుని, విహారయాత్రకని వచ్చిన ఓ జంటను పట్టుకుని, భార్య కళ్ళముందే భర్తను తుపాకీతో కాల్చేశారు. దాంతో ఆ భార్య రోదన వర్ణనాతీతం. పాకిస్థాన్ కేంద్రంగా ఉగ్రోన్మాద కార్యకలాపాలు నిర్వహిస్తున్న 'లష్కరే తోయిబా' అనుబంధ విభాగానికి చెందిన 'ద రెసిస్టెంట్స్ ఫ్రంట్' అనే ఉగ్రసంస్థ ఈ దారుణానికి పాల్పడినట్లు భద్రతా దళాలు భావిస్తున్నాయి. ఈ ఉగ్రదాడిలో హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న నిఘా విభాగం అధికారి మనీశ్‌రంజన్, కర్నాటకకి చెందిన ప్రముఖ వ్యాపారి మంజునాథ్ కూడా ఉన్నారు. కేంద్రం వెంటనే.. ఇంత ఘోరానికి పాల్పడిన ఆ నరహంతకుల భరతంపట్టాలి. ఉగ్రవాదుల వెన్నులో వణుకు పుట్టేలా వారిని కఠినంగా శిక్షించాలి.

# అధ్వాన్నంగా అన్నమయ్య కూడలి

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

నగరంలోని అత్యంత సుందరమైన ఆధ్యాత్మిక కూడలిగా ప్రసిద్ధిచెందిన ప్రాంతం మినీబైపాస్‌లోని అన్నమయ్య కూడలి. ఓ వైపు శ్రీ వెంకటేశ్వర ఆలయం, మరోవైపు సుప్రసిద్ధ ఇస్కాన్ మందిరం మధ్యలో అన్నమయ్యలతో ఈ కూడలి ఎంతో పవిత్రత సంతరించుకుంది. అలాంటి పవిత్రమైన కూడలి దురాక్రమణలతో అధ్వాన్నంగా తయారయ్యింది. ముఖ్యంగా శ్రీవెంకటేశ్వర దేవాలయం వైపు వెళ్ళే మార్గం అక్రమార్కులకి అడ్డాగా మారిపోయింది. ఈ ఘోరం పైన ఇటీవల మన 'లాయర్' కూడా వార్త ప్రచురించింది. ఇటు నాయకులలో గానీ, అటు అధికారులలో కానీ చలనం లేకపోవడం సిగ్గుచేటు. వాళ్ళు తల్చుకుంటే అక్రమార్కుల భరతం పట్టొచ్చు. అత్యంత పవిత్రమైన ప్రాంతంగా, అందమైన కూడలిగా అన్నమయ్య కూడలిని తీర్చిదిద్దొచ్చు. కానీ, ఎందుకనో కళ్ళముందే జరుగుతున్న దారుణాన్ని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. రూరల్ ఏంఎల్ఏ శ్రీధర్‌రెడ్డి గారు ఈ విషయంపైన దృష్టి సారించాలని నా మనవి. అన్నమయ్య కూడలిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దితే వేలాది మంది భక్తులు ఆయనని ప్రశంసించి ఆశీర్వదిస్తారు. ఆధ్యాత్మికతత్పరుల హృదయాలలో ఆయన శాశ్వతంగా నిలిచిపోతారు.

ఎం. రమేష్‌శర్మ
మాగుంట లే అవుట్, నెల్లూరు.

# ఆ వంతెన ఎప్పుడైనా కూలొచ్చు!

నెల్లూరు నుండి కనుపర్తిపాడు మీదుగా గొలగమూడికి వెళ్ళే రహదారిని విస్తరింపచేశారు. అలాగే ఇక్కడ వీధి లైట్లు కూడా ఏర్పాటుచేస్తే బాగుంటుందని గతంలో మన 'లాయర్' ప్రజావాణి ద్వారానే నాయకులని, అధికారులని అభ్యర్థించాను. ఇదే మార్గంలో ఇందిరమ్మ కాలనీ వద్ద పారుదల కాలువపై వున్న వంతెన కూడా శిధిలావస్థకి చేరింది. పాత రోజుల్లో కేవలం ఎద్దుల బళ్ళు, ట్రాక్టర్‌లు వెళ్ళేలా ఎప్పుడో పురాతన కాలంలో ఇక్కడ చిన్న వంతెన నిర్మించారు. ఇప్పుడా వంతెన అవసాన దశకి చేరింది. ఎప్పుడో అకస్మాత్తుగా కూలిపోయే స్థితిలో ఉంది. అంతే కాకుండా ఒక వాహనం వెళ్తే ఇంకొక వాహనం పట్టని విధంగా ఇరుకుగా కూడా ఉంది. ఈ వంతెనని విస్తరించి ఆధునీకరించాలని కోరుతున్నాను. వంతెనకి ఆవలివైపు కూడా నగరం విస్తరించి గొలగమూడి వరకూ జనావాసాల సంఖ్య పెరిగిపోతోంది. లే అవుట్లు రూపుదిద్దుకుంటున్నాయి. కొత్తగా కాలనీలు ఏర్పడుతున్నాయి. ఈ క్రమంలో ఇందిరమ్మ కాలనీ వద్దగల వంతెన విస్తరణ ప్రజలకి చాలా ఉపయోగకరమవుతుందనడంలో సందేహం అవసరం లేదు. – ఆర్. పీ. రామయ్య, కొండాయపాళెం.

### ఆనం సారు విగ్రహం

# మినీ బైపాసులో పెట్టాలి

నెల్లూరు నగరంలో స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డి సారు విగ్రహం పెట్టాలని నేతలు సంకల్పించడం స్వాగతించదగ్గ అంశం. ముఖ్యంగా ఈ విషయంలో రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సారు చొరవచూపడం శుభపరిణామం. రాజకీయాలు, వర్గాలు పక్కనబెట్టి ప్రజాదరణ పొందిన దివంగత నాయకుడి విగ్రహం పెట్టడానికి ముందుకు రావడం సంతోషంగా ఉంది. అన్ని వర్గాల ప్రజల ఆదరణ పొందిన మాస్ లీడర్ వివేకానందరెడ్డి సారు. అయితే, ఆనం విగ్రహం పొదలకూరురోడ్డులో కాకుండా మినీ బైపాస్‌లోని కొండాయపాళెం కూడలిలో ఏర్పాటుచేస్తే సమంజసంగా ఉంటుంది. నేతలు, అధికారులు ఆ దిశగా ఆలోచించాలని నా మనవి.

సయ్యద్ హుస్సేన్ - భక్తవత్సలనగర్, నెల్లూరు.




# కాన్పుల్లో కష్టాలు.. ఆగని తల్లులు మరణాలు!

*"పెదవే పలికిన మాటల్లోనే తియ్యని మాటే అమ్మ,*
*కదిలే దేవత అమ్మ... కంటికి వెలుగమ్మ.*
*మనలోని ప్రాణం అమ్మ, మనదైన రూపం అమ్మ,*
*ఎనలేని జాలి గుణమే అమ్మ.*
*నడిపించే దీపం అమ్మ, కరుణించే కోపం అమ్మ,*
*వరమిచ్చే తీపి శాపం అమ్మ..."*

యువ సినీ రచయిత చంద్రబోస్ కలం నుండి జాలువారిన కమ్మనైన అమ్మ పాటలోని కొన్ని చరణాలు ఇవి.

అవును, నవమాసాలు మోసి జన్మనిచ్చేది అమ్మ. సాక్షాత్తూ దేవతా స్వరూపం అమ్మ. బిడ్డని కని, పెంచే కనిపించే దైవం అమ్మ. తన నెత్తురు ధారపోసి, కడుపులోని బిడ్డకు ఊపిరిపోసే అమృతమూర్తి అమ్మ. అలాంటి అమ్మను మనం కంటికి రెప్పలా కాపాడుకుంటున్నామా?.. అంటే, లేదనే మాటే ఎక్కువగా వినపడటం అత్యంత బాధాకరం. గర్భిణుల పట్ల మన సమాజంలో నిర్లక్ష్యమే రాజ్యమేలుతోంది. అందులోనూ, ప్రసవ సమయంలో ఆసుపత్రులకు వచ్చే మహిళల విషయంలో మన వ్యవస్థలు సరైన జాగ్రత్తలు తీసుకోవడం లేదు. అనేక ప్రభుత్వాసుపత్రుల్లో నేటికీ సరైన వైద్య వసతులు లేవు. నైపుణ్యం కలిగిన వైద్యసిబ్బంది లేరు. ప్రభుత్వాలు కానీ, పాలకులు కానీ గర్భిణుల ఆరోగ్యం వ్యవహారంలో తీసుకోవాల్సిన స్థాయిలో జాగ్రత్తలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ధనార్జనే ధ్యేయంగా పనిచేసే ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్ళే స్థోమత చాలామందికి ఉండదు. వాటివైపు కన్నెత్తిచూసే సాహసం కూడా వాళ్ళు చేయలేరు. పేద బడుగు బలహీన వర్గాల వారికి అరా కొరా వసతులున్న ప్రభుత్వ దవాఖానాలే దిక్కు. దీంతో దేశంలో నానాటికీ మాతాశిశు మరణాలు పెరిగిపోతూనే ఉన్నాయి. సరైన సమయంలో తగు చికిత్సలందక ప్రసవ సమయాల్లో ఏటా వేలాదిమంది ప్రాణాలు కోల్పోతున్నారని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## సాధారణ ప్రసవమే.. బిడ్డలకు శ్రేయస్కరం

సాధారణ ప్రసవాలే బిడ్డ ఆరోగ్యానికెంతో శ్రేయస్కరం. కానీ, మనదేశంలో సాధారణ ప్రసవాలకంటే సిజేరియన్ కాన్పులే ఎక్కువగా జరుగుతుండడం విచారకరం. సిజేరియన్ అయినా, సాధారణ కాన్పయినా ఒకటేనని, పుట్టే బిడ్డలకు ఇబ్బంది ఉండదని గర్భిణులు భావించడం దీనికి ప్రధాన కారణం కావచ్చు. కానీ, సిజేరియన్ ప్రసవాలతో పుట్టే పిల్లలకు ఆరోగ్యసమస్యలు వస్తాయని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. సాధారణ ప్రసవంలో పుట్టిన పిల్లలకు తల్లి నుంచి ప్రయోజనకరమైన బ్యాక్టీరియా అందుతుందని, సిజేరియన్ ద్వారా పుట్టేవారికి ఆ అవకాశం లేకపోవడంతో, పిల్లలు తేలిగ్గా ఇన్‌ఫెక్షన్లకు, అలర్జీలకు గురవుతారని, క్రమేణా వ్యాధినిరోధకశక్తి తగ్గిపోయి దీర్ఘకాలిక వ్యాధులు, బాధలతో ఇబ్బందులుంటాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే, ఈ ముప్పుల నుంచి బయటపడాలంటే, పిల్లలు పుట్టినప్పటి నుంచి ఎప్పటికప్పుడు సరైన పోషకాహారం అందజేస్తుండాలని కూడా వారు సూచిస్తున్నారు.

## కాసుల కోసమే.. సిజేరియన్ ఆపరేషన్లు!

గర్భిణులకు సిజేరియన్ ఆపరేషన్ చేసేయడమన్నది ఇప్పుడొక ఫ్యాషన్‌గా మారింది. వెంటనే ఆపరేషన్ చేయకుంటే తల్లీబిడ్డకు ప్రమాదమంటూ భయపెడుతున్నారు. నిబంధనల ప్రకారం అత్యవసర పరిస్థితులలో మాత్రమే చేయాల్సిన సిజేరియన్‌ని అవసరం లేకపోయినా చేసేస్తున్నారు. వీటివల్ల మరణాలు కూడా పెద్దసంఖ్యలో సంభవిస్తున్నాయి. దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లో, ముఖ్యంగా ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రుల్లో సిజేరియన్లు లెక్కకుమించి జరిగిపోతూనే ఉన్నాయని అనేక సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఏటా వేలాది మంది మహిళలు ఈ అనవసరపు సిజేరియన్ల వల్ల మరణిస్తున్నట్లు కూడా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న ఈ అనవసర సిజేరియన్ల పట్ల మహిళాలోకంలో సరైన అవగాహన ఉండడం లేదు. కొన్ని సందర్భాలలో తమకు సిజేరియనే కావాలని గర్భిణులే కోరుతున్నారు. ఏ సమయంలో ఆపరేషన్ చేయాలో కూడా వారే ముహూర్తం పెట్టుకుని మరీ చేయించుకుంటున్నారు. ఇదే అదనుగా డబ్బు కోసం ఆసుపత్రుల నిర్వాహకులు సైతం వారు కోరినట్లే చేస్తున్నారు. అసలు, సిజేరియన్ అవసరం లేకున్నా కూడా దానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. అది చివరికి తల్లీబిడ్డల ఆరోగ్యానికి చేటు తెస్తోంది.

## ప్రసవానంతరం.. కూడా బాధలేనా?...

బిడ్డలకు జన్మనిచ్చి మరణించే తల్లులు, కడుపులోనే కన్నుమూసే శిశువులు. తల్లీబిడ్డలు ఒకేసారి చనిపోవడం వంటివి ప్రసవ సమయాల్లో తరచూ జరుగుతుండడం మామూలే. ప్రసవమంటే తల్లికి రెండో జన్మ అని ఊరకే అనలేదు. కాన్పు వేళ ఎన్ని కష్టాలో చెప్పలేం. అనుభవించే తల్లులకే ఆ బాధలు తెలుస్తాయి. ఆధునిక కాలంలో వైద్యశాస్త్ర పరిజ్ఞానం ఆకాశమంత ఎత్తుకు పెరిగినా, మనదేశంలో ఇంకా మాతాశిశు మరణాలు పెరుగుతుండడం బాధాకరం. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో, కొండలు కోనల్లోని మారుమూల ప్రాంతాలలో నేటికీ సరైన ఆసుపత్రులు లేవు. ఎక్కడో దూరంగా ఉన్న ప్రాంతాలకు కాన్పుకోసం వెళ్తూ, మార్గమధ్యంలోనే నిండు గర్భిణులు కన్నుమూస్తున్న దయనీయ సంఘటనలు కోకొల్లలు. దేశం ఎంతో పురోగతి సాధిస్తున్నా, గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులకి సరైన వైద్యచికిత్సలందించే ఆసుపత్రులు లేకపోవడం విచారకరం. ఇకనైనా మాతాశిశువుల ఆరోగ్య సంరక్షణల పట్ల ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న సిజేరియన్ ఆపరేషన్లను అడ్డుకోవాలి. మాతాశిశు పథకాలను మరింతగా పటిష్టం చేయాలి. మహిళల మరణాలని నివారించడానికి పూర్తిస్థాయిలో ప్రభుత్వాలు కృషిచేయాలి..! -రాజశ్రీ

# చంద్రబాబుతో అనుబంధం.. నాకెంతో గర్వకారణం

## - మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి




రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చాలా కాలం నుంచి తనకు సాన్నిహిత్యం ఉందని, ఆయన 35 ఏళ్ల వయసులో ఉన్నప్పటి నుంచి రాజకీయ రంగంలో తాను ఆయనతో నడుస్తున్నానని, చంద్రబాబుతో సుమారు 40 ఏళ్ళ అనుబంధం తనకెంతో గర్వకారణమని మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 75వ పుట్టినరోజున సోమిరెడ్డి ఆధ్వర్యంలో తోటపల్లిగూడూరు మండలం వెంకన్నపాళెంలో గిరిజనుల మధ్య ఆ జన్మ దిన వేడుకలు ఘనంగా జరిగాయి. చంద్రబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్తూ, గిరిజన మహిళలకు చీరలు, చిన్నారులకు నోటు పుస్తకాలు, మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, చంద్రబాబుతో తనకున్న ఆత్మీయతాభిమానాన్ని వివరించారు. 75ఏళ్ళ వయసులో కూడా రాష్ట్రాభివృద్ధి కోసం ఎంతో ఉత్సాహంతో చంద్రబాబునాయుడు చేస్తున్న కృషి అపూర్వమని ఆయన కొనియాడారు. తన రాజకీయ జీవితం ప్రారంభం నుంచి ఒకే పార్టీ, ఒకే నాయకత్వం, ఒకే నియోజకవర్గంలో కొనసాగుతున్నానని ఆయన అంటూ, దివంగత మహానేత ఎన్టీఆర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, యువనేత లోకేష్‌ల సారధ్యంలో పనిచేసే అవకాశం కలగడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం తపించే చంద్రబాబునాయుడు పేరు చెబితేనే హైటెక్ సిటీ, అమరావతి రాజధాని, త్వరలో పూర్తికావస్తున్న పోలవరం ప్రాజెక్టు వంటివెన్నో గుర్తుకొస్తాయన్నారు. ఇప్పుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న చంద్రబాబునాయుడు గతంలో చేపట్టిన వివిధ సంస్కరణలు, కీలక నిర్ణయాల ఫలితంగా లక్షలాది మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా స్థిరపడ్డారని, అభివృద్ధికి - సంక్షేమానికి ఆయన ప్రాధాన్యత ఇస్తుండడం రాష్ట్ర ప్రజల అదృష్టమని అన్నారు. గత ప్రభుత్వం నామరూపాలు లేకుండా చేసిన అనేక వ్యవస్థలను చంద్రబాబు ముఖ్యమంత్రిగా వచ్చాక మళ్లీ గాడిలో పెడుతున్నారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు కార్పొరేషన్లను పునరుద్ధరించి ఆయా వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుస్తున్నారని అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల సహకారం, సమన్వయంతో రాష్ట్రాన్ని దేశానికే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దే కృతనిశ్చయంతో ముందుకు సాగుతున్న చంద్రబాబుకు, తెలుగుదేశం పార్టీకి ప్రజలందరూ మరింతగా ఆశీస్సులందించాలని ఆయన కోరారు.

### కాలధర్మం

# లయన్ నాదెళ్ల వెంకటరమణయ్య



నాదెళ్ళ వెంకటరమణయ్య ఏప్రిల్ 19వ తేదీ సాయంత్రం తమ 86వ ఏట తుదిశ్వాస విడిచారు. ఆయన కొంతకాలంగా స్వల్ప అనారోగ్యంతో ఉన్నారు. లయన్ ఎన్.రమణయ్యగా ఆయన ప్రసిద్ధి. నెల్లూరుజిల్లా ఉదయగిరి మండలం చెన్నపనాయునిపల్లి రమణయ్య స్వగ్రామం. ఆయన విద్యాభ్యాసమంతా నెల్లూరులోనే జరిగింది. వీ.ఆర్.కళాశాల నుండి డిగ్రీ పొందారు. అనంతరం 1961లో తన 22వ ఏట జయలక్ష్మి బైండింగ్ వర్క్స్, జయలక్ష్మి బ్యాగ్ వర్క్స్ పేరుతో స్వయంగా వ్యాపారం మొదలుపెట్టారు. అదే ఏడాది అనసూయమ్మని తన సహధర్మచారిణిగా చేసుకున్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ పేపర్ మిల్స్ వారితో ఏర్పడ్డ సాంగత్యం, వారి సహకారంతో 1980లో ఎస్.వీ. పేపర్ ఏజెన్సీస్ పేరుతో ఆంధ్రా పేపర్ మిల్స్‌కి విజయవాడ, నెల్లూరు డిస్ట్రిబ్యూటర్‌గా కొన్ని దశాబ్దాల పాటు ఆ రంగంలో రాణించారు.

స్వతహాగా ఆధునిక భావాలు కలిగిన రమణయ్య మారుతున్న కాలంతోపాటు తన వ్యాపారాన్ని కూడా మార్చుకుంటూ వచ్చారు. ఎలక్ట్రానిక్స్ గృహోపకరణాలకి పెరుగుతున్న ఆదరణ గమనించిన ఆయన 2002 సంవత్సరంలో ఆ రంగంలో అడుగుపెట్టారు. ఎస్‌వీఆర్ మార్కెటింగ్ ఏజెన్సీస్, ఎస్‌వీఆర్ డిజిటల్ ప్లాజాలని ప్రారంభించారు. శాంసంగ్ టీవీలతో పాటు ఇతర శాంసంగ్ ఉత్పత్తుల అధీకృత డిస్ట్రిబ్యూటర్‌గా జిల్లాలో ఖ్యాతి గడించారు.

### లయన్ రమణయ్య..!

రమణయ్యకి లయన్స్ క్లబ్ అంటే ప్రాణం. లయన్స్ క్లబ్ వేదికగా సేవా కార్యక్రమాలలో పాల్గొనడం ఆయనకి పెద్ద వ్యసనం. లయన్స్ క్లబ్ సభ్యుడిగా 1980లో సభ్యత్వం తీసుకున్నారు. అప్పటినుండి తన తుదిశ్వాస వరకు లయన్స్ క్లబ్ సేవలో తరించారు. నెల్లూరు లయన్స్ క్లబ్ కోశాధికారిగా, కార్యదర్శిగా, అధ్యక్షుడిగా విశిష్ట సేవలందించారు. అదే ఉత్సాహంతో జోనల్ ఛైర్మెన్‌గా, రీజియన్ ఛైర్మెన్‌గా కూడా తన సేవలు విస్తరించారు. లయన్స్ జిల్లా 316-11 గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టి అంతర్జాతీయ లయన్స్ దృష్టిని ఆకర్షించారు. గవర్నర్ హోదాలో భారతదేశంతో పాటు పలు ఇతర దేశాలు కూడా సందర్శించారు. లయన్స్ క్లబ్ ద్వారా అనేక సత్కార పురస్కారాలని రమణయ్య అందుకున్నారు. నిత్యం ఆయన శ్వాస, ధ్యాస అంతా లయన్స్ క్లబ్బే అన్నట్లుగా ఆ సంస్థ కోసం తపించేవారు.

### ఆధ్యాత్మిక ధార్మిక సేవాతత్పరుడు..!

ఆధ్యాత్మికంగా కూడా రమణయ్య సేవలు చిరస్మరణీయం. తమ స్వగ్రామం చెన్నపనాయునిపల్లిలో శిథిలావస్థలోవున్న రామాలయాన్ని పునఃనిర్మించారు. నగరంలో పలు దేవాలయాలకి ఆర్థిక చేయూతనిచ్చారు. ఎక్కడ ఏ అవసరమున్నా నేనున్నా అంటూ నగరంలోని అనేక సేవాసంస్థలకి భూరి విరాళాలని అందించి తన సేవాతత్వాన్ని చాటుకున్నారు. తన సొంత పేరుతో నాదెళ్ళ వెంకటరమణయ్య చారిటబుల్ ట్రస్టుని కూడా ఆయన ఏర్పాటుచేశారు. తమ ట్రస్టు ద్వారా పేదపిల్లల చదువుకి చేయూతనందిస్తున్నారు.

ఎనిమిది పదుల వయసు పైబడిన తరువాత కూడా ఆయన నిత్యం చలాకీగా వుండేవారు. ఏడాదిన్నర క్రితం తన సతీమణి అనసూయమ్మ ఆకస్మికంగా కాలం చేయడంతో రమణయ్య మానసికంగా కుంగిపోయారు, దిగులుతో అనారోగ్యానికి దగ్గరయ్యారు. చివరికి దైవసన్నిధికి చేరిపోయారు.

రమణయ్యకి అయిదుమంది సంతానం. ముగ్గురు కుమారులు ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమారుడు కృష్ణప్రసాద్ వ్యాపారవేత్తగా విజయవాడలో స్థిరపడ్డాడు. మిగిలిన ఇద్దరు కుమారులు సురేష్‌కుమార్, మురళీకృష్ణలు నాన్న వ్యాపార వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. కుమార్తెలలో ఒకరు తిరుపతిలో, మరొకరు అమెరికాలో స్థిరపడ్డారు.

కొడుకులు, కోడళ్ళు, కుమార్తెలు, అల్లుళ్ళు, మనుమలు, మనుమరాళ్ళు, మునిమనుమడు, మునిమనుమరాలుతో పరిపూర్ణ తృప్తికర జీవితాన్ని అనుభవించి కన్నుమూశారు రమణయ్య. ఇంటి పెద్దదిక్కుని కోల్పోయి శోకసముద్రంలో ఉన్న నాదెళ్ళ కుటుంబసభ్యులకి ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

# స్వచ్ఛాంధ్రను సాధించుకుందాం!

## మంత్రి నారాయణ పిలుపు




కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాష్ట్రంలో తిరిగి అభివృద్ధి పనులు పుంజుకుంటున్నాయని, రాష్ట్రాన్ని బాగా అభివృద్ధి చేసుకుని స్వచ్ఛాంధ్రను సాధించుకుందామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డా. పొంగూరు నారాయణ పిలుపునిచ్చారు. ఇటీవల నెల్లూరులో 'స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్' కార్యక్రమంలో భాగంగా సుమారు 5వేల మందితో జరిగిన భారీ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. తొలుత, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఛైర్మెన్ కృష్ణయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్‌కుమార్ రెడ్డిలతో కలసి అల్లీపురంలోని డంపింగ్ యార్డ్ వద్ద బయో మైనింగ్ యూనిట్‌ను, 7వ డివిజన్‌లోని బీవీఎస్ పాఠశాల వద్ద ఇ-వ్యర్థాల సేకరణ కేంద్రాన్ని మంత్రి నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందన్నారు.

### వైకాపా చెత్త పాలనతో రాష్ట్రం అప్పుల పాలు :

గత ప్రభుత్వం చెత్త పన్నుతో పాటు, చెత్త పాలన అందించిందని, రాష్ట్రానికి కోట్ల రూపాయల అప్పులు, లక్షలాది టన్నుల చెత్తను మాత్రం మిగిలించిందని మంత్రి నారాయణ ఈ సందర్భంగా దుయ్యబట్టారు. మున్సిపాలిటీల నిధులను కూడా గత ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో, కూటమి వచ్చాకనే.. దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన రాష్ట్రంగా నవ్యాంధ్రను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషిచేస్తున్నారన్నారు. మన మనసు, ఇల్లు, పరిసరాలు అన్నీ స్వచ్ఛంగా ఉన్నప్పుడే స్వచ్ఛాంధ్ర సాధ్యపడుతుందన్నారు. అందుకోసం ప్రతి నెలా మూడవ శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో, ఇళ్లలో పేరుకుపోయిన పాత టీవీలు, కంప్యూటర్లు, ప్రింటర్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను స్థానికంగా ఏర్పాటుచేసిన కేంద్రాలలో అందజేయాలన్నారు. వాటిని రీసైకిల్ చేసి పలు ఉత్పత్తులను తయారుచేసే అవకాశం ఉంటుందన్నారు. ఇ-వ్యర్థాలను సక్రమంగా నిర్వహించకపోతే పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. వచ్చే అక్టోబర్ 2వతేదీ నాటికి రాష్ట్రంలోని చెత్తను పూర్తి స్థాయిలో తొలగించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, అందుకు ప్రజలందరి సహకారం కూడా అవసరమని ఆయన కోరారు. ఈ సందర్భంగా వేలాదిగా హాజరైన విద్యార్థులు, ఇతరులతో మంత్రి నారాయణ స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. నెల్లూరు నగరపాలక సంస్థకు కేటాయించిన రోడ్లను శుభ్రం చేసే యంత్రాలను ప్రారంభించారు. 'నుడా' చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఇన్‌చార్జ్ కమిషనర్ వైఓ నందన్ పాల్గొన్నారు.

# ఎన్‌బికెఆర్‌లో..రాడార్ ఇంజనీరింగ్‌పై సదస్సు




కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న ఇసిఇ విద్యార్థులకు 'అడ్వాన్స్డ్ డ్రైవ్ అసిస్టెంట్ సిస్టమ్ ఏ ప్రాక్టికల్ వర్క్‌షాప్ ఆన్ రాడార్' పేరుతో రాడార్ ఇంజనీరింగ్, దాని అనువర్తనాలపై ప్రయోగాత్మక శిక్షణా సదస్సు నిర్వహించారు. ఈనెల 22న జరిగిన ఈ సదస్సులో ఎన్ఐటి (సూరత్) ప్రొఫెసర్ డా.పి.శ్రీహరి, జీఎస్ వందన ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, ఇసిఇ విభాగాధిపతి డా.జి.హరినాథ్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్ డా.పి.శ్రీహరి సదస్సును ప్రారంభించారు. రాడార్‌ల వ్యవస్థలపైన అవగాహన కలిగించి, డ్రైవర్ లేకుండా వాహనాలు నడపడం, వాటిని నియంత్రించే విధానాలను ప్రయోగాత్మకంగా వక్తలు విద్యార్థులకు వివరించారు. వీటిని విద్యార్థులు అధ్యయనం చేయడం ద్వారా రక్షణ రంగంలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. కో-ఆర్డినేటర్ డా.జి.కామేశ్వరి మాట్లాడుతూ, ఇంజనీరింగ్‌లో వినియోగించే వివిధ సెన్సార్‌లు, వాటి ధర్మాలు, అనువర్తనాలు మానవాళికి ఏవిధంగా ఉపయోగపడతాయో తెలుసుకునేందుకు ఇలాంటి సదస్సులు ఉపకరిస్తాయన్నారు. కార్యక్రమ కోఆర్డినేటర్లు ఏ.రామకృష్ణప్రసాద్, ఆర్ లావణ్య తదితరులు పర్యవేక్షించారు.

# శీనయ్యను పరామర్శించిన.. నారాయణ



గత కొద్దిరోజులుగా గుండెకి సంబంధించిన సమస్యలతో బాధ పడుతూ, చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో బైపాస్ సర్జరీ చేయించుకున్న ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని ఇటీవల రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ కలుసుకుని పరామర్శించారు. నెల్లూరులోని మాగుంట కార్యాలయానికి వచ్చిన మంత్రికి మాగుంట శీనయ్య స్వాగతం పలికారు. శీనయ్య ఆరోగ్య పరిస్థితిని గురించి మంత్రి నారాయణ అడిగి తెలుసుకుని, త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం, ఒంగోలు కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులు, జాతీయరహదారికి సంబంధించిన పనుల విషయమై మంత్రి ఆయనతో చర్చించారు. మంత్రి వెంట నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కరరెడ్డి తదితరులున్నారు.

# ఇన్‌చార్జి కమిషనర్‌గా.. నందన్



నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ ఉద్యోగోన్నతిపై బదిలీ కావడంతో, ఆ స్థానంలో వైఓ నందన్‌ను ఇన్‌చార్జిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఆ తర్వాత నందన్‌కే పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు కేటాయిస్తూ, మళ్ళీ ఈనెల 22న తాజాగా రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. దీంతో నెల్లూరు కార్పొరేషన్ నిర్వహణ బాధ్యతలు నందన్ నిర్వహించనున్నారు.

# టెన్త్‌లో.. 'డా.కిషోర్స్ రత్నం' విద్యార్థుల ప్రతిభ



పదవతరగతి పరీక్షా ఫలితాల్లో నెల్లూరులోని డా.కిషోర్స్ రత్నం విద్యాసంస్థల విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకున్నారు. తమ విద్యాసంస్థలకి చెందిన ఎన్.నారాయణ్ 600 మార్కులకు గాను 595 మార్కులు సాధించాడని, అదేవిధంగా ఏ.ఉదయ్‌ప్రణవ్ 594, సిహెచ్ నవదీప్ 594, వై.చరణ్ తేజ్ 593, వై.రాహిణి 593, ఎస్ రిషికారెడ్డి 592, డి.రిషిత 592, ఎస్‌కె నఫియా సుహానా 592, సీహెచ్ గాయత్రి సింధు 592, సింధు హాసిని 591, ఎన్.సాయిశ్రీ 591, యు.హంసిని 590, టి.మధులిక 590, ఎం.పూజితారెడ్డి 590, గిరివర్ధన్ 590 మార్కులతో గణనీయమైన విజయాన్ని సాధించారంటూ విద్యాసంస్థల నిర్వాహకులు ఆనందపడుతున్నారు. వీరేకాక, మరో 12 మంది 590 మార్కులకు పైగా, 40 మంది 580 మార్కులకు పైగా, 136 మంది 550 మార్కులకు పైగా, 251 మంది 500 మార్కులకు పైనే సాధించారని వారు చెప్తూ, ఆ విద్యా సంస్థల డైరెక్టర్లు రోషిణి, ఈశ్వర్‌లు వారిని అభినందించారు. ఈ విజయానికి సహకరించిన వారందరికీ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్లు డా.కృష్ణకిషోర్, డా వాసంతి కిషోర్‌లు శుభాకాంక్షలు తెలిపారు.

# నెల్లూరు కబుర్లు

## సేవా ప్రభాకరుడు..వేమిరెడ్డి

### కొనియాడిన శ్రీధర్‌రెడ్డి



వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) అంటేనే సేవా కార్యక్రమాలకు మారుపేరని, వారి సేవానిరతి అపూర్వమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కొనియాడారు. పదిమందికీ మేలుచేసే వ్యక్తి విపిఆర్ అని అన్నారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా ఈనెల 19న నెల్లూరులోని తమ కార్యాలయంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విపిఆర్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం, పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి సంబంధించి బుజబుజనెల్లూరు మరియు కనుపర్తిపాడు ఫ్లైఓవర్ల మంజూరు విషయంలో విపిఆర్ తనకందించిన సహకారం మరువలేనిదన్నారు. త్వరలోనే నెల్లూరు రూరల్ నియోజకవర్గం లోని దివ్యాంగులకు చేయూతగా విపిఆర్ బ్యాటరీ సైకిళ్లను అందించబో తున్నారని తెలిపారు. సమాజానికి అపారమైన సేవలందిస్తున్న విపిఆర్ పది కాలాలపాటు చల్లగా ఉండాలని, ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు మరిన్ని చేపట్టేందుకు భగవంతుడు వారికి ఆశీస్సులందజేయాలని ప్రార్థిస్తున్నానని ఆయన చెప్పారు.

## ఫ్రెండ్స్ వాకర్స్..ఉచిత వైద్యశిబిరం



నెల్లూరు ఏసీ స్టేడియంలోని ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో ఇటీవల ఉచిత వైద్యశిబిరం నిర్వహించి వాకర్స్‌కు ఆరోగ్య సలహాలనిచ్చారు. ప్రముఖ వైద్యులు శ్రీధర్‌రెడ్డి పాల్గొని స్టేడియంలోని వాకర్స్ అందరికీ ఆరోగ్యపరీక్షలు చేసి, షుగర్ వ్యాధిగ్రస్తులు ఈ ఎండాకాలంలో ఇబ్బందులు పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. చెన్నై హాస్పిటల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ సౌజన్యంతో ఈ మెడికల్ క్యాంపు నిర్వహించారు. సెంటర్ అధినేత రమేష్ మాట్లాడుతూ, వాకర్ సభ్యులు ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తగా ఉండాలన్నారు. వాకర్స్ అధ్యక్షులు కిలారి శ్రీనివాసులు నాయుడు, కార్యదర్శి గువ్వల నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్..203 జిల్లా ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, చెంచయ్య, శివయ్య, నజీర్ అహ్మద్, సోను, రామ్మోహన్‌రెడ్డి, నరసింహచౌదరి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# జెఇఇ మెయిన్స్‌లో..

## 'విశ్వసాయి' విజయకేతనం



ప్రభుత్వం తాజాగా ప్రకటించిన జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో నెల్లూరు మాగుంట లేఅవుట్ లోని 'విశ్వసాయి' జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగరేశారు. జాతీయస్థాయిలో ఉత్తమ ఉత్తీర్ణతలు సాధించి తమ సత్తా చాటుకున్నారు. ఈ కళాశాలకు చెందిన 57మందికి పైగా విద్యార్థులు జాతీయస్థాయిలో జెఇఇ అడ్వాన్స్ పరీక్షకు కూడా అర్హత సాధించారు. తమ కళాశాల విద్యార్థి రామ్‌రుత్విక్ జాతీయస్థాయిలో 208వ ర్యాంకు, ఎం.శ్రావణ్‌కుమార్‌రెడ్డి 356వ ర్యాంకు సాధించారని కళాశాల నిర్వాహకులు తెలిపారు. అంతేకాక, 90 కంటే ఎక్కువ పర్సంటైల్‌ను 9 మంది సాధించారని, వీరంతా మే 18న జరిగే జెఇఇ అడ్వాన్స్ పరీక్షల్లో కూడా ప్రతిభాపాటవాలతో రాణిస్తారని కళాశాల ఛైర్మెన్ డా. కృష్ణమోహన్ ఆకాంక్షించారు. మెయిన్స్ ఫలితాల్లో మంచి ఉత్తీర్ణతలు సాధించిన కళాశాల విద్యార్థులందరినీ ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ విజయాలకి కారణమైన విద్యార్థులు, వారి తల్లితండ్రులు, ఉపాధ్యాయులందరికీ తమ కృతజ్ఞతలు తెలిపారు.

# ఎస్ఎస్‌సిలో..'శ్రీ నేతాజీ' ప్రభంజనం



ఈనెల 23న విడుదలైన ఎస్ఎస్‌సి ఫలితాల్లో నెల్లూరు శ్రీనివాస అగ్రహారానికి చెందిన శ్రీ నేతాజీ పైలట్‌స్కూల్ విద్యార్థులు తమ సత్తా చాటారు. తమ విద్యార్థులు ఎం.నవీన్‌స్వరూప్‌రెడ్డి 600 మార్కులకు గాను 594 మార్కులతో ఉత్తమరీతిలో విజయం సాధించాడు. అదే విధంగా టి.బవేష్‌వర్ధన్ 591, కె.వినయకుమార్ 591మార్కులతో రాణించాడు. తమ స్కూల్‌కి చెందిన మొత్తం 165 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని, 93 మంది విద్యార్థులు 500కి పైగా మార్కులు సాధించారని పాఠశాల కరెస్పాండెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి తెలిపారు. ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థులను, వారి తల్లితండ్రులను, ఉపాధ్యాయులను పాఠశాల ప్రెసిడెంట్ వేదవతి సుబ్బారెడ్డి, డైరెక్టర్లు కె.నరేంద్రరెడ్డి, డా.ఎస్.సుబ్రామ్, డా. అలేఖ్యరెడ్డి, ప్రిన్సిపాల్ జీవీ సుధ, వైస్ ప్రిన్సిపాల్ కె.స్పందన, హెడ్మాస్టర్ ఎస్‌వివిఎల్ నరసింహారావు, ఏటి చెంచయ్య తదితరులు అభినందించారు.

# సాయిదర్బార్‌లో రక్తదానం



నెల్లూరు బాలాజీనగర్ శివార్లలో ఉన్న పద్మావతినగర్‌లోని శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరంలో ఈనెల 20న మందిరం నిర్వాహకులు మధుసాయి సారధ్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శ్రీ సాయి దర్బార్ యువ సేవాదళ్ సభ్యుడు కే.శీ కనుమూరు సాయినాథ్‌రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ శిబిరంలో పెద్దసంఖ్యలో పాల్గొని భక్తులు రక్తదానం చేశారు. శ్రీ షిరిడీసాయి బోధించిన మానవసేవ, సామాజిక సేవలో భాగంగా మందిరం వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నోవా బ్లడ్‌బ్యాంక్ వారు సహకరించగా, భక్తులు 77 యూనిట్ల రక్తాన్ని దానం చేసినట్లు మందిరం నిర్వాహకులు తెలిపారు. బాధితుల ప్రాణాలు నిలబెట్టేందుకు రక్తదానం ఎంతో అవసరమని అంటూ, రక్తదానం చేసిన దాతలకు శ్రీసాయినాథుని దివ్య ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటూ మందిర ఛైర్మెన్ మధుసాయి ప్రార్థనలు నిర్వహించారు. సాయిదర్బార్ యువ సేవాదళ్ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని సాయిదర్బార్ గౌరవ సలహాదారు పాబోలు రామ సుబ్బయ్య తదితరులు పర్యవేక్షించారు.






# శ్రీ రామానుజాచార్యుల

## జయంతి ఉత్సవాలు

నెల్లూరు నగరంలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి ఆలయం ప్రాంగణంలో కొలువైవున్న శ్రీ రామానుజాచార్యుల వారి 1008వ జయంతి వేడుకలు ఈనెల 23న ప్రారంభమయ్యాయి. వచ్చే నెల 2వ తేదీ వరకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తామని, 2వ తేదీన స్వామివారికి పుష్పపల్లకి జరుగుతుందని ఆలయ ఇఓ ఆళ్ళ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఆమేరకు కరపత్రాలను ఇటీవల మంత్రి నారాయణ నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించగా, ఆలయ వేదపండితులు మంత్రికి ఆశీస్సులందజేశారు.

### ఉప్పొంగిన అభిమానం..
# తరలివచ్చిన ఆత్మీయ జనం



**• సేవాసంబరంగా.. విపిఆర్ జన్మదినం**



నెల్లూరు ముద్దుబిడ్డ, పేద ప్రజల ఆరాధ్య దైవం, సేవామూర్తి, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జన్మదినోత్సవం ఏప్రిల్ 19న జిల్లా వ్యాప్తంగా ఒక పండుగ సంబరంగా ఆనందకోలాహలంగా జరిగింది. ఈ సందర్భంగా నెల్లూరు-గొలగమూడి రోడ్డులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో పెద్దసంఖ్యలో యువత పాల్గొనడం విశేషం. విపిఆర్ సతీమణి..కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన మెగా రక్తదానశిబిరంలో రక్తదానం చేసేందుకు యువత పోటీపడ్డారు. ముఖ్యంగా కోవూరు నియోజకవర్గం నుంచి భారీస్థాయిలో నాయకులు, కార్యకర్తలు, యువకులు స్వచ్ఛంధంగా వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. ఏకంగా రికార్డు స్థాయిలో 1260 యూనిట్ల రక్తం సేకరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ, ప్రభుత్వ సర్వజనాసుపత్రి, నోవా బ్లడ్ బ్యాంక్, నారాయణ హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో రక్తసేకరణ జరిగింది. రెడ్‌క్రాస్ ఛైర్మన్ వాకాటి విజయ్‌కుమార్‌రెడ్డి రక్తదాన శిబిరంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. రక్తదానం చేసినవారికి ధ్రువీకరణ పత్రాలు కూడా అందించారు.




## మైపాడు బీచ్‌లో భారీ సైకత శిల్పం

నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఏప్రిల్ 19న ఇందుకూరుపేట మండలంలోని ఆయన అభిమానులు ప్రత్యేక సైకత శిల్పం రూపొందించి వినూత్నరీతిలో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. టిడిపి నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఐదు మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన 10 అడుగుల ఎత్తైన సైకత శిల్పం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సరికొత్త శిల్పంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చిత్రంతోపాటు.. ఆయన పేద ప్రజల కోసం చేసిన సేవా కార్యక్రమాల చిత్రాలను అందులో ప్రతిబింబించారు. విపిఆర్ విద్య, విపిఆర్ వైద్యం, దివ్యాంగులకు ట్రై సైకిల్స్, విపిఆర్ అమృత ధార వాటర్ ప్లాంట్ల చిత్రాలను ప్రత్యేకంగా పొందుపరిచారు. తొలుత, మత్స్యకార సోదరులు భారీ కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్లమెంటులో మత్స్యకారుల సమస్యలను ప్రస్తావించి మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తున్న ఆయన సేవలను కొనియాడారు. వారి సారధ్యంలో రానున్న ఐదేళ్లలో మైపాడు బీచ్ మరింతగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## విడవలూరులో మినీ స్టేడియం

**- ప్రశాంతిరెడ్డి హామీ**

కోవూరు నియోజకవర్గం విడవలూరులో మినీ స్టేడియం నిర్మాణాన్ని త్వరలోనే ప్రారంభించి పూర్తిచేస్తామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హామీ ఇచ్చారు. ఇటీవల ఆమె ప్రజావిజ్ఞప్తుల స్వీకారం కార్యక్రమంలో భాగంగా విడవలూరును సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విడవలూరులో మినీ స్టేడియంతో పాటు డిగ్రీ కళాశాల ప్రహరీగోడ నిర్మాణాన్ని కూడా అతి త్వరలోనే పూర్తి చేయిస్తామని భరోసా ఇచ్చారు. అదేవిధంగా విడవలూరులోని ఇందిరమ్మ కాలనీ, కామాక్షినగర్ ప్రాంతాల్లో డ్రైనేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చేస్తామన్నారు. కోవూరు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రోల్‌మోడల్‌గా నిలుపుతామని చెప్పారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ముందుకెళ్తున్నామని, అభివృద్ధి-సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ పరిపాలన చేయడం ఒక్క చంద్రబాబుకే సాధ్యమన్నారు. నిరక్ష్యరాస్యత నిర్మూలనలో ప్రజా ప్రతినిధులు, నాయకులు భాగస్వాములై కోవూరు నియోజకవర్గంలో సంపూర్ణ అక్షరాస్యతకు కృషి చేయాలని ఆమె ఈ సందర్భంగా ప్రజలను కోరారు.

## డిఎస్ఆర్‌లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత



ప్రభుత్వం ఈనెల 23న విడుదల చేసిన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో అల్లూరు మండలం నార్త్‌మోపూర్‌లోని దేవిరెడ్డి శారదా హైస్కూల్ విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించి తమ సత్తా చాటుకున్నారు. పరీక్షలకు హాజరైన 61 మంది విద్యార్థులలో 54 మందికి 500 మార్కులు పైన రావడం, అందులో కొనగళ్ల వెంకట మన్వర్ చక్రవర్తి అనే విద్యార్థి 591 మార్కులు సాధించి మండలంలోనే ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించడం తమకెంతో సంతోషం కలిగిస్తోందని డిఎస్ఆర్ ట్రస్ట్ సీఇఓ ఇందుపూరు అనిల్‌కుమార్‌రెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ మల్లినేని శ్రీలతాచౌదరి తెలిపారు. విద్యార్థులను, తల్లితండ్రులను, ఉపాధ్యాయులను ట్రస్ట్ యాజమాన్యం అభినందించారు.

### నరసింహకొండ దేవస్థానం..
# ఉత్సవ కమిటీ ఛైర్మన్‌గా అచ్యుత్‌రెడ్డి



జిల్లాలోని ప్రముఖ నారసింహక్షేత్రాల్లో ఒకటైన, నెల్లూరు రూరల్‌మండలం నరసింహకొండపై వెలసివున్న శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో మే 5 నుంచి 16వ తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగనున్న నేపథ్యంలో, ఈనెల 21న దేవాదాయశాఖ ఉన్నతాధికారులు 'ఫెస్టివల్ కమిటీ'ని ఏర్పాటుచేసి, ఉత్సవాల విజయవంతానికి కృషిచేయాలని సూచించారు. 11మందితో ఏర్పడిన ఈ కమిటీలో నెల్లూరు రూరల్ పొట్టేపాళెం గ్రామానికి చెందిన ఇందుపూరు అచ్యుత శంకరరెడ్డి ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ముత్తంశెట్టి శీనయ్య, చెరుకూరు సింహాద్రి, పురిణి సరస్వతి, బెల్లం శ్రీనివాసులురెడ్డి, తోడేటి కామాక్షమ్మ, మడపాకుల జయమ్మ, కొత్తకోట కవిత, డబ్బుగుంట కృష్ణయ్య, సంధి మురళియాదవ్, కందుకూరు శ్రావణి సభ్యులుగా బాధ్యతలు నిర్వహించనున్నారు.

**మంత్రి ఆనంను కలసిన శ్రీధర్‌రెడ్డి, అచ్యుత్‌రెడ్డి :**

నరసింహకొండ దేవస్థానం ఉత్సవ కమిటీ నియామక ఉత్తర్వులు వెలువడిన తర్వాత, నరసింహకొండ దేవస్థానం ఉత్సవ కమిటీ ఛైర్మన్ అచ్యుత్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇరువురూ కలసి రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. దేవస్థానం మాజీ ఛైర్మన్ ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకులు జెన్ని రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో 60 వాటర్ ప్లాంట్లకు ఏర్పాట్లు

**- - మంత్రి నారాయణ వెల్లడి - -**




నెల్లూరు నగరంలో పేదల కోసం కేవలం 2 రూపాయలకే 20 లీటర్ల సురక్షిత మంచినీరు ఇచ్చేలా చర్యలు చేపడుతున్నామని, అందుకోసం 60 వాటర్‌ప్లాంట్‌లను కూడా సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులోని 48వ డివిజన్‌లోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ సుజల సురక్షిత త్రాగునీటి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2014-19లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నిరుపేదల కోసం ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని గుర్తుచేశారు. అయితే, ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసిందని తెలిపారు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక వాటర్‌ప్లాంట్ల ఏర్పాటు కోసం రెండు కోట్ల 75 లక్షల ఖర్చు చేసి, 3 మదర్ ప్లాంట్లు, 60 చిన్న ప్లాంట్లను ఏర్పాటు చేయడం జరిగిందని, వీటి ద్వారా సుమారు 15 వేల కుటుంబాలకు 2 రూపాయలకే 20 లీటర్ల సురక్షిత తాగునీరు అందించడం జరుగుతుందన్నారు. ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరమైతే మరో అరవై ప్లాంట్లను కూడా ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.






# జానకిరామ.. రామాయణం 62

- ఊటుకూరు జానకి రామారావు



ఖరుడితో మనకు కలిగిన వైరం, అతనిని సంహరించడం వలన మన మీద ప్రతీకారం తీర్చుకోనేందుకు రాక్షసులు పన్నిన ఏదో పన్నాగమది.. అని పలికి నిలుచున్నాడు రామానుజుడు.

తను ఆ విధంగా ఆందోళనపడుతూ మాట్లాడినప్పటికీ ఏమీ పట్టించుకోకుండా స్థిమితంగా, నిమ్మకు నీరెత్తినట్లున్న లక్ష్మణుని చూసి సీతాదేవికి వళ్ళు మండిపోయింది.

చాలా కోపంతో ఎర్రబడ్డ కళ్ళతో, నీవు కులంలో చెడ బుట్టావు, మనసులో దుష్టపు ఆలోచనతో రాముడి ఆపద గురించి ఏ మాత్రం ఆలోచించటం లేదు. ఆయనకు ఆవిధంగా జరగాలని కోరుకుంటున్నావు అని గట్టిగా అరిచింది సీతాదేవి.

పాపపు అభిప్రాయాలు కడుపులో పెట్టుకొని రహస్యంగా ప్రవర్తించే నీ వంటి వాడు మిత్రుడి రూపంలోని శత్రువు.

దుష్టబుద్ధివి నీవు, భరతుడిచే ప్రేరేపింపబడి మమ్మల్ని అనుసరిస్తూ వస్తున్నావు. ఇది నీ పన్నాగమైనా, భరతుడి పన్నాగమైనా, మీ కోరిక సిద్ధించదు. ప్రాణాలైనా నేను తీసుకుంటాను కానీ మీకెప్పటికీ వశం కాను.

ఉన్మాదినిలా మాట్లాడుతున్న ఆవిడ మాటలు విని.. ఇంద్రియ నిగ్రహవంతుడైన లక్ష్మణుడు అంజలి ఘటించి నమస్కరిస్తూ..

అమ్మా! నీ మాటలకు బదులు చెప్పటం నా కిష్టం లేదు, నీవు నాకు దైవం. ఈవిధంగా మాటలాడటం స్త్రీ సహజ లక్షణమే! జనకుని కొమరితవైన ఓ సీతాదేవీ పదునైన బాణాల వంటి నీ పలుకులు ములుకులలాగా నా హృదయాన్ని పీడిస్తున్నాయి, సహించలేకున్నాను.

స్త్రీవైన నీవు అన్నగారి ఆజ్ఞ పాటించుచున్న నన్ను అనరాని మాటలంటున్నావు, ధర్మవిరుద్ధంగా ప్రవర్తిస్తున్నావు.

అందుకు ఈ వన దేవతలే సాక్షి!

ఛీ! నీ విప్పుడు నశించెదవుగాక!

నేనిప్పుడే రాముడున్న చోటికి వెళ్ళెదను, ఇప్పుడు అగుపడుతున్న శకునాలు చూడబోతే నేను మరల నిన్ను తిరిగి చూస్తాననే నమ్మకం కలగటం లేదు.. అని బాధ నిండిన హృదయంతో పలికిన లక్ష్మణుని చూసి,

రాముడు లేకపోతే నేను ఇప్పుడే ఇదుగో ఈ గోదావరిలో దూకిచస్తాను, లేదా ఉరి వేసుకుంటాను, లేదా అదుగో ఆ కనపడుతున్న ఎత్తైన గిరిశిఖరం మీదనుండి దూకి చస్తాను అని పలికింది సీతాదేవి.

విషమైనా త్రాగుతాను, అగ్నిలో దూకనైనా దూకుతాను కానీ అన్యుడైన పరపురుషుని పాదాలతోనైనా తాకను.. అని అంటూ గుండెలు బాదుకొంటూ ఏడుస్తోంది సీతమ్మ.

ఆమెను ఓదార్చడానికి విఫలయత్నం చేసి తనవల్లగాక అభివాదం చేసి మాటిమాటికీ వెనుదిరిగిచూస్తూ విడిచిపెట్టలేక, విడిచిపెట్టలేక రాముడి కొరకు అడవిలోకి పయనమయ్యాడు సుమిత్రా నందనుడు.

పాపమా పిచ్చితల్లి ఒంటరిగా భర్తనుగురించిన తలపులతో ఆయనకు ఏ ఆపద వాటిల్లిందో అనే భీతితో తల్లడిల్లిపోతూ దిగులుగా కూర్చొని ఉంది.

ఇంతలో ఆ పర్ణశాల ముందు వేదఘోష చేసుకుంటూ, అత్యంత మృదువైన కాషాయ వస్త్రం ధరించి, శిఖను, ఛత్రమును, పాదుకలను ధరించి, మంగళకరమైన దండ కమండలాలను ఎడమ భుజానికి తగిలించుకొని ఒక సన్యాసి వస్తున్నాడు.

అతడు మారు వేషంలో వచ్చిన సర్వలోక భయంకరుడైన రావణుడు.

చంద్రసూర్యులు లేని సంధ్యను అంధకారం ఆవరించినట్లు ఆమె సమీపంలోకి వచ్చాడు రావణుడు.

ఆయన్ని చూడగానే జనస్థానంలోని పశుపక్ష్యాదులన్నీ కూడా గజగజ వణికిపోయినాయి, గాలి కూడా భయంతో మెల్లగా వీచసాగింది, అప్పటివరకు గలగలా ప్రవహించే గోదావరి నది తన వేగాన్ని, ఉధృతిని తగ్గించుకొని చాలా నెమ్మదిగా ప్రవహించసాగింది.

రామ లక్ష్మణులిరువురూ లేని సమయాన్ని చూసుకొని, ఇదే అదనుగా భావించి లోకకంటకుడైన రావణుడు సీతాదేవిని సమీపించి నిలిచాడు.

ఈ లోకంలో లేదు సీతమ్మ!

మనసంతా మగని గుర్చిన ఆలోచనలే!

పరిపరి విధాలుగా పోతున్న మనస్సును అదుపు చేసుకోలేక భర్తకు ఆపద వాటిల్లిందేమో అని చింతిస్తూ ఉన్న ఆవిడ తనకు వాటిల్లబోయే విపత్తును లేశమాత్రం కూడా గ్రహించలేని స్థితిలో దైన్యంతో అలాగే కూర్చుని ఉంది.

రావణుడు సీతాదేవిని చూశాడు. వాడి మీద మన్మథుడు తన పని చేసుకుపోతున్నాడు.

వాడిలో వికారం మొదలయ్యింది.

పద్మంలో కూర్చున్న లక్ష్మీదేవిలాగా ప్రకాశించే సీతమ్మను కామాతురుడై నిర్లజ్జగా, నిర్భయంగా చూస్తూ ఆవిడ సౌందర్యాన్ని చూపులతో గ్రోలుతూ ఇలా పలికాడు.

ఓ దేవీ! నీ శరీరం అంతా పద్మముల వరుసలాగా ఉంది. పద్మలత లాగా ఉంది నీ తనువు(అనగా ముఖం పద్మం, హస్తాలు పద్మాలు, పాదాలు పద్మాలు, నేత్రాలు పద్మాలు).

ఇన్ని పద్మాలు ధరించిన నీవు ఎవ్వరవు?

శుభకరమైన ముఖం కలదానా! నీవు పార్వతివా?

నీవు కీర్తికి అధిష్టాన దేవతవా?

కాంతికి అధిష్టాన దేవతవా?

ఐశ్వర్యానికి అధిష్టాన దేవతవా?

మంగళప్రదురాలైన శ్రీ లక్ష్మివా?

అప్సరసవా?

స్వేచ్ఛాసంచారిణి అయిన రతీదేవివా?

ఎవరవు? నీవెవరవు?

అందమైన చిరునవ్వు, ముత్యములవంటి పలువరుస, చక్కని నేత్రాలు గల ఓ విలాసవతీ!

నీవు నా హృదయాన్ని, మనస్సును వరద ఉధృతితో ఉన్న నది ఒడ్డులను ఎలా కోసివేస్తుందో అలా కోసివేశావు.

జగదేకమోహినివై భాసిల్లుతున్న నీవు ఎవరు?

గంధర్వ కాంతవా? అప్సరసవా? కింనర స్త్రీవా?

లేక యక్షజాతికి చెందిన దానివా?

అయినా నేను ఇంతకుమునుపు నీ వంటి స్త్రీని ఏ జాతిలోనూ చూసి ఉండలేదు.

క్రూరమృగాలకు ఆలవాలమై, భయంకరమైన రాక్షసులు స్వేచ్ఛగా సంచరించే ఈ ఘోరాటవిలో నీవెందుకు ఒంటరిగా నివసిస్తున్నావు? నిన్ను చూసి నా మనసు తల్లడిల్లుతుంది.

నీ వంటి అపురూప సౌందర్యరాశి ఉండదగ్గ ప్రదేశం కాదిది!

రమణీయ ప్రాసాదోపరిభాగాలు, సుందర ఉద్యానవనాలు ఉన్న నగర ప్రాంతాలు నీవు సంచరించుటకు అనుకూలమైనవి!

నల్లని కన్నులు కల ఓ కోమలాంగీ...

నీవు శ్రేష్ఠమైన పూలమాలలు ధరించి, శ్రేష్ఠమైన ఆహారం, శ్రేష్ఠమైన వస్త్రాలు, శ్రేష్ఠుడైన భర్తతో సుఖించటం యుక్తం అని నా అభిప్రాయం.

అని పలుకుతున్న బ్రాహ్మణ రూపంలోనున్న రావణుని చూసి సీతమ్మ.. సమస్త అతిథి ఉపచారాలతో సేవించింది, అర్ఘ్యపాద్యాదులిచ్చి భోజనం సిద్ధంగానున్నది అని కూడా పలికింది.

కాషాయ వస్త్రం ధరించి బ్రాహ్మణ వేషంతో ఉన్న రావణుడు ఏ మాత్రం ద్వేషింపరాని ప్రశాంతచిత్తుడి లాగా కనపడుతున్నాడు సీతమ్మకు.

అలాంటి రావణునికి, ఇంటికి వచ్చిన అతిథికి ఏ ఏ మర్యాదలు చేయాలో ఆయా మర్యాదలన్నీ చేసి నిండుగా మాటలాడుతుంది సీతా మహాసాధ్వి.

కానీ, రూపుదిద్దుకున్న దురాలోచనతో ఉన్న రావణుడు తన చావును ఆహ్వానిస్తూ సీతాదేవిని బలాత్కారంగా అపహరించాలని మనస్సులో నిశ్చయించుకున్నాడు.

ఒక అమాయకురాలైన పల్లెపడుచు తన అంతరంగాన్ని ఏ దాపరికం లేకుండా ఎలా బహిర్గతపరుస్తుందో అంతగా కల్లా కపటం లేకుండా తమ వివరాలను భిక్షుకవేషధారి అయిన రావణునికి ఎరిగించింది సీతమ్మ!

ఓ బ్రాహ్మణుడా ఒక ముహూర్తకాలం నీవు వేచి ఉంటే నా భర్త తీసుకొని వచ్చు రుచికరమైన ఆహారం నీకు ఇవ్వగలదానను, నీవు నివసింపదలచుకొన్న ఎడల మాతో ఇచ్చటనే ఉండవచ్చు అని పలికింది జానకీదేవి.

మరల సీతాదేవి ఆయనున్ద్దేశించి, ఓ ద్విజుడా నీ కులం, గోత్రం, నామధేయం ఎరిగింపుము అని అడిగింది. ..(సశేషం)

# భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్, బంగ్లాదేశ్!

మనసులో మాట 42

భారత్ పొరుగున ఉన్న రెండు దేశాల అగ్రనేతలు ఇటీవల కాలంలో భారత్ లక్ష్యంగా చేసిన ప్రకటనలు కలవరపర్చే విధంగా ఉన్నాయి. పాకిస్థాన్ సైన్యాధిపతి అసీమ్ మునీర్ మాట్లాడుతూ భారత్ మతం హిందూ మతమని, పాకిస్థాన్ మతం ఇస్లాం అని అందుకే తమ పూర్వీకులు ముందుచూపుతో రెండు జాతుల సిద్ధాంతాన్ని ముందుకు తీసుకొచ్చి ముస్లింల కోసం భారత్ నుంచి వేరుపడి పాకిస్థాన్ దేశాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. అంతేకాదు.. కశ్మీర్‌ను తాము మరిచిపోమని చెప్పారు. ఈ విషయాలన్నింటినీ చిన్నారులకు బోధించాలని కూడా చెప్పారు.

బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేతగా బాధ్యతలు నిర్వహిస్తున్న యూనస్.. చైనా పర్యటనలో మాట్లాడుతూ భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలపై అవాంఛిత వ్యాఖ్యలు చేశారు. చుట్టూ భూభాగంతో మూసివేసి ఉన్న ఈశాన్య రాష్ట్రాలకు సముద్ర మార్గం తమ ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని, ఈ ప్రాంతంలో సముద్రానికి తామే పరిరక్షకులమని అన్నారు. బంగ్లాదేశ్‌ను చైనా ఆర్థిక విస్తరణగా చూడాల్సిందిగా కూడా ఆయన ఆ పర్యటనలో సూచించారు. బంగ్లాదేశ్ నుంచి చైనా ఎక్కడికైనా వెళ్లవచ్చని, ఇక్కడి సముద్రం పరిరక్షకులం తామేనని అన్నారు.

ఒక చిన్న పదమే కావచ్చు, ఒక చిన్న వాక్యమే కావచ్చు.. భౌగోళిక రాజకీయాల గతినే మార్చేస్తాయి. దేశాల మధ్య సంబంధాలను తారుమారు చేస్తాయి. ముప్పు సంకేతాలను వెలువరిస్తాయి. అందుకే విదేశీ వ్యవహారాలకు సంబంధించి నేతలు కానీ, అధికారులు కానీ మాట్లాడేటప్పుడు ఆచితూచి మాట్లాడతారు. ఎంతో అధ్యయనం చేసి మాట్లాడతారు. యథాలాపంగా మాట్లాడరు. ఇప్పుడు యూనస్ మాట్లాడినా, అసీమ్ మునీర్ మాట్లాడినా అవి యథాలాపంగా మాట్లాడినవి కావు. దీర్ఘకాలిక వ్యూహంతోనే మాట్లాడారు. పైపెచ్చు వారు మాట్లాడిన మాటలు సొంతంగా మాట్లాడారని అనుకోవడానికి కూడా వీలు లేదు. బాహ్య శక్తుల ప్రమేయంతోనే మాట్లాడినట్లు స్పష్టమవుతోంది. రెండు దేశాలు ఆర్థికంగా బలహీనంగా ఉన్నాయి. పాకిస్థాన్ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ పరిస్థితుల్లో వారు బాహ్యశక్తుల ప్రభావానికి లోనవడం తేలిక.

భారత్ సొంతమైన ఈశాన్య రాష్ట్రాల బాగోగులపై వ్యాఖ్యలు చేయడం ద్వారా యూనస్ తన పరిధిని తీవ్రంగా అతిక్రమించినట్లే. ఈశాన్యరాష్ట్రాలకు నేరుగా సముద్రమార్గంతో అనుసంధానం ఉండకపోవచ్చు. అది భారత భౌగోళిక అంశం. దాని గురించి యూనస్ మాట్లాడాల్సిన అవసరం లేదు. ఈశాన్య రాష్ట్రాల ఉత్పత్తులకు కావాల్సిన రవాణా ఏర్పాట్లు భారత్ చూసుకోగలదు. కానీ ఈశాన్య రాష్ట్రాల గురించి ప్రత్యేకంగా మాట్లాడడం ద్వారా ఆ ప్రాంతంలో యూనస్ విషబీజం నాటడానికి ప్రయత్నించారు. బంగ్లాదేశ్ నుంచి ఎక్కడికైనా వెళ్లవచ్చు అన్న యూనస్ వ్యాఖ్యలను పరిశీలిస్తే ఈశాన్య రాష్ట్రాలను భారత్ ప్రధాన భూభాగంతో కలిపే వ్యూహాత్మక సిలిగుడి ప్రాంతాన్ని దృష్టిలో ఉంచుకుని అన్న మాటలే అని భౌగోళిక–రాజకీయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇది ఏమాత్రం ఉపేక్షించే వ్యవహారం కాదు. షేక్ హసీనా బంగ్లాదేశ్‌లో అధికారంలో ఉన్నప్పుడు ఆ దేశంలోని చిట్టగాంగ్, మోంగ్లా ఓడరేవు ద్వారా స్వేచ్ఛగా వాణిజ్యం చేసుకునే అవకాశం కల్పించారు. అయితే హసీనా ప్రభుత్వంపై దుష్టశక్తుల దాడితో ఆమె భారత్‌కు వచ్చేసిన తర్వాత పాకిస్థాన్‌కు కూడా ఆ ఓడరేవు నుంచి వాణిజ్యం చేసుకునే అవకాశాన్ని బంగ్లాదేశ్ కల్పించింది. దీన్ని బట్టే రెండు దేశాల పాలకుల కుయుక్తులు అర్థం చేసుకోవచ్చు. ఏ దేశం దాష్టీకాలను తట్టుకోలేక విడిపోయారో ఆ దేశంతోనే బంగ్లాదేశ్ ప్రస్తుత పాలకులు అంటకాగడం తీవ్ర దురదృష్టకర పరి ణామం. బంగ్లాదేశ్ ప్రస్తుత పాలకులు పాకిస్థాన్‌తో కలిసి ఇప్పుడు భారత్‌ను శత్రు వైఖరితో చూస్తున్నారు. పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ బంగ్లాదేశ్‌లో మత ఛాందసవాద, తీవ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ వివిధ గ్రూపులను పెంచి పోషిస్తోంది. మరో వైపు బంగ్లాదేశ్‌లోని పాకిస్థాన్ హైకమిషన్.. బంగ్లాదేశ్‌లోని న్యాయవ్యవస్థ సహా వివిధ వ్యవస్థల్లో తన ప్రభావాన్ని పెంచుకుంటూ ఉగ్రవాదులను విడిపించే ప్రయత్నాలు చేస్తోందన్న వార్తలు కూడా కలవరపర్చే అంశం. ఈ పరిణామాలన్నింటినీ గమనిస్తే బంగ్లాదేశ్ ప్రస్తుత పాలకులు ఛాందసవాద శక్తుల ప్రభావానికి లోనవుతున్నారని అర్థమవుతోంది. పాకిస్థాన్ సైన్యాధిపతి వ్యాఖ్యలు కూడా ఇస్లాం భావజాలాన్ని బలోపేతం చేసే విధంగానే ఉన్నాయి. ఇప్పుడు రెండు దేశాల పాలకుల ఉమ్మడి ఆసక్తి ఇస్లాం వాదం, దాని ఆధారంగా భారత్‌ను చీకాకుపర్చడం. చైనా ఆర్థిక, విస్తరణవాద కాంక్షతో ఆ దేశాలకు పరోక్షంగా మద్దతు ప్రకటిస్తున్నట్లు ఈ పరిణామాలన్నింటి బట్టి అర్థమవుతోంది. చైనా ప్రభావానికి గురవుతున్న బంగ్లాదేశ్ ప్రస్తుత పాలకులు, నిస్వార్థంగా స్నేహహస్తం అందించే భారత్‌ను దూరం చేసుకోవాలనుకోవడం చరిత్రాత్మక తప్పిదమే అవుతుంది. ఇటువంటి తప్పిదాలే గతంలో చేసిన శ్రీలంక, నేపాల్‌లు ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్నాయి.

అయితే భారత్ తక్షణమే విదేశీ వ్యవహారాలను పునఃసమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది. మిత్రదేశంగా ఉన్న బంగ్లాదేశ్ స్వార్థశక్తుల, ఛాందసవాద శక్తుల చేతుల్లోకి వెళ్లేదాకా తెలియకపోవడం, జాగ్రత్తపడకపోవడం, భారత్‌కు ఆప్తురాలైన బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కట్టుబట్టలతో దేశం విడిచిరావాల్సి రావడం మన దేశంలోని కోట్ల మంది ప్రజలను విస్మయానికి గురిచేసింది. పొరుగున ఉన్న దేశాలు... విస్తరణ కాంక్ష తీవ్రంగా ఉన్న, నిత్యం భారత సరిహద్దుల్లో చీకాకు పెడుతున్న చైనా ప్రభావానికి లోనుకాకుండా దీర్ఘకాలిక వ్యూహాలను రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది.



తుమ్మల బాల గంగాధర్ తిలక్

తిరుపతి జిల్లా **గూడూరు డివిజన్**

# స్వచ్ఛ ఆంధ్రతో ఆరోగ్యకర రాష్ట్రం

## కలెక్టర్ వెంకటేశ్వర్



స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్రతో ప్రజలకు ఆరోగ్యకర రాష్ట్రాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌తో కలిసి ఇటీవల ఆయన స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటి ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ తమ ఇళ్లతోపాటు పరిసర ప్రాంతాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. గూడూరు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్‌కు విన్నవించారు. గూడూరు చెరువుకట్టను పరిశీలించి త్వరితగతిన సుందరీకరణ పనులుచేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఎస్పీ గీతాకుమారి, తహశీల్దార్ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పాల్ హారిస్ జయంతి వేడుకలు



తిరుపతి జిల్లా గూడూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఎఎఆర్ రోటరీ భవనంలో ఇటీవల రోటరీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు పాల్ హారిస్ 157వ జయంతి వేడుకలు జరిగాయి. రొటేరియన్స్ పాల్గొని ఆయనకు అంజలి ఘటించి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రొటేరియన్ వజ్రాల శివరామిరెడ్డి దాతృత్వంతో రెండు వాటర్ కూలర్లు బహుకరించారు. రోటరీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, దాత శివరామిరెడ్డి, మయూరి శ్యాంయాదవ్, మునిగిరీష్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సెరీనా, జీజీనాయుడు, జి.దశరథరామిరెడ్డి, రఘురామిరెడ్డి, బాలకృష్ణంరాజు, కిరణ్‌చక్రవర్తి, రాంప్రసాద్, రవీంద్రరెడ్డి, సురేష్, రవికుమార్, పి.కృష్ణ, బలరామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# లిటిల్ ఏంజెల్స్ ప్రభంజనం



పదో తరగతి ఫలితాలలో లిటిల్ ఏంజెల్స్ స్కూల్ ప్రభంజనం సృష్టించింది. 595 మార్కులతో ఏ.పూజిత స్కూల్ టాపర్‌గా నిలవగా, 587 మార్కులతో కే.కృష్ణవేణి, 580 మార్కులతో కే.నరసింహులు ఉత్తమ ఫలితాలు సాధించారు. పరీక్షకు హాజరైన 59 మంది విద్యార్థులలో 41 మంది 500పైన మార్పులు సాధించగా, 100% ఉత్తీర్ణత సాధించడం పాఠశాలకు విద్యార్థుల పట్ల ఉన్న అంకితభావాన్ని తెలియజేస్తుందని, ఇంతటి అద్భుతమైన ఫలితాలు సాధించడంలో భాగస్వాములైన విద్యార్థులకు తల్లి దండ్రులకు ఉపాధ్యాయులకు పాఠశాల డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, కోఆర్డినేటర్ శ్రీమతి సుధేష్ణ అభినందనలు తెలియజేశారు. ఈ అభినందన కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ సురేష్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పలసరుకుల పంపిణీ



గూడూరు, డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఈనెల 20వతేదీ సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 'డా. సిఆర్ రెడ్డి ఆసరా' పథకం ద్వారా 20మంది పేదలకు పలసరుకులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమ దాత డా. సి.జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో ప్రతినెల మూడవ ఆదివారం పేదలకు నెలకు సరిపడా సరుకులు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ప్రజేంద్రరెడ్డి, సంఘం అధ్యక్షులు శ్రీకిరెడ్డి మధుసూదన్ రెడ్డి, దశరథరామిరెడ్డి, మండి శ్రీనివాసులురెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.



# వివిఎస్ఆర్‌లో అత్యుత్తమ ఫలితాలు

గూడూరు రెండవ పట్టణంలోని వివిఎస్ఆర్ పాఠశాల విద్యార్థులు 10వ తరగతి ఫలితాలలో అత్యుత్తమ మార్కులు సాధించారు. 590 మార్కులతో ఎం.తేజశ్వని స్కూల్ టాపర్‌గా నిలువగా, జివిఎస్ యువతేజ, కె.భాష్మిత 587మార్కులు, బి.మృదుల, పి.కార్తీక 584 మార్కులు పొందారు. 22 మంది 550 మార్కులపైన సాధించారు. ఇంతటి ఘన విజయం సాధించినందుకు పాఠశాల డైరెక్టర్ బాలకృష్ణరాజు, కరస్పాండెంట్ అన్నపూర్ణ విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు.

# పదిలో ప్రాస్పరో విజయం



పదవ తరగతి ఫలితాలలో గూడూరులోని ప్రాస్పరో ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు విజయం సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు స్కూల్ యాజమాన్యం అభినందనలు తెలిపి, వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో ప్రాస్పరో హైస్కూల్ అధినేత బి.దశరథరామిరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఆంటోనీ, డైరెక్టర్ శంకర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

# టెన్నికాయిట్ నూతన కార్యవర్గం



తిరుపతి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఇటీవల ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షులు బి.శ్యామ్‌యాదవ్ తెలిపారు. ఉపాధ్యక్షులుగా కోటేశ్వరరావు, మల్లికార్జున్, కార్యదర్శిగా చెంచయ్య, సహాయ కార్యదర్శులుగా రమేష్, రాంబాబు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

# కనుపూరు ముత్యాలమ్మ జాతర వైభవం

గత వైభవాన్ని తెలుసుకుంటూ, వర్తమానంలో జాగ్రత్తగా అడుగులు వేస్తూ, భవిష్యత్తును రూపొందించుకోవడంలో చరిత్రలు ప్రాతినిధ్యం వహిస్తాయి. అలాంటి శతాబ్దాల నాటి "కనుపూరు జాతర" చరిత్రను రచించిన విద్యానగర్ ఎన్.బి.కె.ఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డా. గాది శ్రీనివాస్ అభినందనీయుడు. నెల్లూరుజిల్లాలో ఆధునీకరణకు లొంగకుండా, అత్యంత పురాతన ఆచారాలను అలాగే కొనసాగిస్తున్న జాతర్లలో కనుపూరు జాతర ఒకటి. కనుపూరు జాతర శతాబ్దానికి పూర్వం నుంచే జరుగుతున్నట్లు ఆధారాలున్నాయి అని రచయిత అన్నారు. కానీ, శ్రీకృష్ణదేవరాయల కాలంలో (క్రీ.శ.1522) కనుపూరులో ముత్యాలమ్మ ఆలయం వద్ద 16కాళ్ళ మండపానికి పశ్చిమాన ఒక శాసనంలో రాయసం కొండమురసయ్య అనే వ్యక్తి ఆగ్రామంలోని 24 గృహాలలో కొంత వార్షిక ఆదాయాన్ని ఈ ఆలయ ధూపదీప నైవేద్యాలకు, కైంకర్యాలకు వినియోగించబడినట్లుగా ఉండడంవల్ల ఈ ఆలయ ప్రాచీనత తెలుస్తున్నది. తరువాతి కాలంలో రచయిత చెప్పినట్టు దచ్చివారు, సెయింట్ జార్జ్‌ఫోర్ట్ గెజెట్‌లలో, 1961లో వచ్చిన ఫెయిర్స్ అండ్ ఫెస్టివల్స్ నెల్లూరు డిస్ట్రిక్ట్‌లలోను ఈ జాతర ప్రస్తావనలున్నాయి. మహాతల్లి ముత్యాలమ్మ తల్లికి ప్రతి ఏటా అమ్మవారికి ఫాల్గుణ మాసం బహుళపక్షం తృతీయార్థంలో జరిగే జాతర నాలుగురోజుల పాటు ఎలా జరుగుతుందో వివరించారు. ఈ అమ్మవార్ల కథలు జాంబపురాణంలో ఉన్నాయని తెలియజేసి, శక్తి ఆరాధనలు వేదకాలం కంటే పురాతనమైనవని చెప్పే ప్రయత్నం చేశారు. ఈ గ్రామ శక్తులు కొద్దిపాటి జాతరలకు, కొలుపులకే తృప్తిపడి భక్తులను అనుగ్రహిస్తున్నారని తెలియజేసిన విధానం చదువదగ్గది. ఆలయ ఛైర్‌పర్సన్ శ్రీమతి సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ ఈ గ్రంథాన్ని అమ్మవార్ల పాదపద్మాలకు అంకితమివ్వడం ముదావహం.





**సమీక్షకులు:**
**డా. టేకుమళ్ళ వెంకటప్పయ్య**
సెల్: 94904 00858






రచయిత:
**డా. గాది శ్రీనివాస్**
వెల: రూ. 50/- పేజీలు: 76
ప్రతులకు: డా.గాది శ్రీనివాస్
ఎన్.బి.కె.ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల
విద్యానగర్, తిరుపతి జిల్లా.
సెల్: 99890 79742





రచయిత:
**నాయుడుగారి జయన్న**
వెల: రూ. 50/- పేజీలు: 47
ప్రతులకు: నాయుడుగారి జయన్న
గద్వాల. సెల్. 98852 17819
అవధాని కోట రాజశేఖర్
నెల్లూరు. సెల్. 99662 36604

# సమాజహితాన్నికాంక్షించే.. 'పవనపుత్ర శతకం'

సామాజిక దృక్పథంతో భక్తిపూర్వక నివేదనగా పండితపామర ప్రశంసల నందుకొన్న శతకం.. నాయుడుగారి జయన్న కవి రచించిన 'పవనపుత్ర శతకం'. ఈ కవి తెలంగాణాలోని జోగులాంబ గద్వాలజిల్లా జల్లాపూర్ అనే గ్రామంలో జన్మించారు. ఎంఏ బీఇడి పట్టా పుచ్చుకొని గురువృత్తిని స్వీకరించి ఉత్తమ ఉపాధ్యాయుడుగా పేరుపొందారు. తన రచనలతో సాహితీ లోకంలో ప్రశంసలందుకున్నారు. వీరి బాల్యం పెద్దమ్మ గారి ఊరయిన పల్లిపాడులో గడిచింది. ఆ ఊరిలో గల ఆంజనేయస్వామిపై భక్తి కుదిరింది. ఆభక్తితోనే చక్కని ఆటవెలది పద్యాలతో ఆయన రచించిన పవనపుత్ర శతకంలో, తను పెరిగిన ఊరిపేరును కలిపి 'పల్లెపాటి వాస పవనపుత్ర' అనే మకుటంతోనే రాశారు. సామాజిక మార్పును కోరుతూ నూటొక్క పద్యాల్లో అనేక అంశాలను ప్రస్తావించారు.

*'కూడు లేక నొకడు కూలిపోవుచునుండె*
*రాజులాగ నొకడు రాలుచుండె*
*రాత దులిపి మంచిగీత గీయవ సామి!'...*

అంటూ, పేదలబతుకులను మార్చాలని ఆ స్వామిని అభ్యర్థించారు. వ్యావహారిక పదాలను ప్రయోగిస్తూ భాషను సామాన్యజనులకు చేరువజేశాడు. సంపద ఉన్నపుడు భగవంతుడు గుర్తుకురాడని తెలుపుతూ, ఈ సమాజాన్ని మార్చి అందరినీ చల్లగాచూడు స్వామీ! అని ఆ పవనపుత్రుణ్ణి అభ్యర్థించాడు. మొత్తమ్మీద ఈ శతకం సమాజహితాన్ని కాంక్షిస్తూ నీతి బోధకంగా ఉంటుంది. ఇలాంటి మంచి శతకాన్ని నెల్లూరుకు చెందిన ప్రముఖ అవధాని, బాలకాండ పద్యానువాదకులు, సంపూర్ణ వాల్మీకి రామాయణం శ్లోకాల ఆడియోకర్త.. కోట రాజశేఖర్‌కి గురుభక్తితో అంకితం ఇవ్వడం ఎంతైనా సంతోషదాయకం. ప్రతి ఒక్కరు దీనిని చదివి ఆనందించి ఇందులోని సూక్తులను గ్రహించి ఆచరించగలరని ఆశిస్తున్నాను.



**సమీక్షకులు:**
**డా. చీమకుర్తి వేంకటేశ్వరరావు**
సెల్: 99088 55294

# మన 'భగవద్గీత'కు.. ప్రపంచస్థాయి గుర్తింపు!

## 'యునెస్కో' వరల్డ్ రిజిస్టర్‌లో నమోదు



భారతీయ సంస్కృతికి, వారసత్వానికి ప్రతీక అయిన మన భగవద్గీతకు ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. ఎంతో పురాతనమైన భగవద్గీతకు, అదేవిధంగా భరతముని రచించిన ప్రాచీనమైన నాట్య శాస్త్ర లిఖిత ప్రతులకు అరుదైన గౌరవం ఇస్తూ, యునెస్కో మెమోరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో వాటిని చేర్చడం ఎంతైనా చరిత్రాత్మకం!.. ప్రతి భారతీయుడు గర్వించ దగిన విషయం. ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 18న యునెస్కో ఈ విషయాలను ప్రపంచానికి వెల్లడించింది. భగవద్గీత, నాట్య శాస్త్ర లిఖితప్రతులతో పాటు, ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన 74 వారసత్వ డాక్యుమెంటరీలను కూడా గుర్తించినట్లు యునెస్కో ప్రకటించింది. దీంతో మొత్తంగా మన భారతీయ వారసత్వాన్ని ప్రతిబింబించే 14 గ్రంథాలను యునెస్కో రిజిస్టర్‌లో చోటు చేసుకున్నాయంటూ, కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలిపారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారతీయులందరికీ గర్వ కారణమని, భారతీయ జ్ఞాన సంపదకు లభించిన ఘనమైన గుర్తింపు అని ప్రధాని నరేంద్రమోదీ హర్షం ప్రకటించారు.

యునెస్కో మెమోరీ ఆఫ్ ది వరల్డ్ రిజిస్టర్ అపూర్వమైన, విశ్వజనీనమైన విలువలు కలిగివున్న రాతపూర్వకమైన వారసత్వ సంపదలను గౌరవిస్తుంది. మానవ చరిత్రకు అర్థవంతమైన రూపాన్నిచ్చి తరతరాలను ప్రభావితం చేసే గ్రంథాలను, రాతప్రతులను, పలు రకాల పత్రాలను గుర్తిస్తూ, తమ సంస్థలో నమోదు చేస్తుంది. మన భగవద్గీత, నాట్య శాస్త్రాలకు అందులో చోటు లభించడం ఓ అద్భుతమైన విశేషం!..



## చెన్నై సీబా ఇన్‌స్టిట్యూట్‌లో బీఎంఆర్

చెన్నైలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రాకిష్ వాటర్ ఆక్వా కల్చర్ (సీబీఏ)ని ఇటీవల రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు (బీఎంఆర్) సందర్శించారు. రొయ్యలకు సోకే వ్యాధి నివారణ అంశాలపై సీబా డైరెక్టర్‌తో, సిబ్బందితో చర్చించారు. రొయ్యలకు వస్తున్న వ్యాధులతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, ఆ వ్యాధుల నివారణపై ఆ ఇన్‌స్టిట్యూట్ ద్వారా తగినంత స్థాయిలో ప్రచారం కల్పించి ఆక్వా రైతులకు చేయూత అందించాలని కోరారు. సెప్టెంబర్‌లో సీబా ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించనున్న రొయ్యల వ్యాధుల సర్వైలెన్స్ కార్యక్రమం గురించి కూడా బీఎంఆర్ చర్చించారు.

# నరరూప రాక్షసులు!

(మొదటిపేజీ తరువాయి)

పహల్గాం సమీపంలోని బైసరన్ లోయకు కొందరు పర్యాటకులు వెళ్లారు. అక్కడ ఉండే పచ్చిక బయళ్లను చూస్తూ ప్రకృతిని ఆస్వాదిస్తూ సంబరపడుతున్నారు. వారిని అక్కడి స్థానికులు గుర్రాలపై తీసుకొస్తూ చరిత్రను వివరించే ప్రయత్నం చేస్తున్నారు. సరిగ్గా ఆ సమయంలోనే పచ్చిక బయళ్ల నుంచి మతపిచ్చి తలకెక్కిన కొన్ని మానవ మృగాలు భారత ఆర్మీ జవాన్ల యూనిఫాంను పోలిన దుస్తులతో పర్యాటకులను సమీపించాయి. తొలుత భద్రతా విధులను నిర్వహిస్తున్న మిలిటరీ సిబ్బంది అని భావించిన పర్యాటకులు, ఆ తర్వాత పాకిస్థాన్ నుంచి వచ్చిన ముష్కరమూక అని నిర్ధారించుకున్నారు. తప్పించుకునేందుకు ఎంతో ప్రయత్నించారు. అయితే ఉగ్రవాదులు అతి సమీపం నుంచి కాల్పులకు తెగబడడంతో తప్పించుకోలేకపోయారు. దాక్కునేందుకు అవకాశం లేకపోవడంతో అక్కడికక్కడే తూటాలకు నేల కొరిగారు. ఈ సమయంలో ఉగ్రవాదులు భారత్‌ను దూషిస్తూ, మహిళలు, పిల్లల ముందు వారి భర్తలను, తండ్రులను, భాగస్వాములను హేళనచేస్తూ వారి జీవిత దీపాలను ఆర్పేశారు. ఈ మారణ హోమంలో 28 మంది మరణించగా, మరో 20 మంది తూటాగాయాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇక మరణించిన వారిలో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖకు చెందిన చంద్రమౌళి, నెల్లూరు జిల్లా కావలికి చెందిన మధుసూదన్‌రావు ఉండడం అత్యంత బాధాకరం. చంద్రమౌళి మృతదేహానికి విశాఖ విమానాశ్రయంలో సీఎం చంద్రబాబు నివాళులర్పించారు. ఉగ్రదాడులతో దేశ సమైక్యతను, సమగ్రతను దెబ్బతీయలేరని ఈ సందర్భంగా చంద్రబాబు స్పష్టం చేశారు. ఉగ్రవాద వ్యతిరేక చర్యల్లో కేంద్రానికి అన్నివిధాలుగా సహకరిస్తామని ఆయన వెల్లడించారు.

### పాకిస్థాన్‌పై కేంద్రం కన్నెర్ర..

ఇప్పటికే ఉగ్రవాదానికి స్వర్గధామంగా మారిన పాకిస్థాన్‌ను దౌత్యపరంగా, క్రీడల పరంగా దూరంపెట్టిన భారత్, కాశ్మీర్ ఉగ్రదాడితో అన్ని సంబంధాలను తెంచుకోవాలని నిర్ణయించింది. ఇది ముమ్మాటికీ పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రదాడేనని, భారత ప్రధాని విదేశీ పర్యటనలో ఉండగా, అగ్రరాజ్యం అమెరికా ఉపాధ్యక్షుడు భారత్‌లో పర్యటిస్తుండగా ఈ ఘాతుకానికి పాల్పడడం ద్వారా పాకిస్థాన్ క్షమించరాని తప్పిదం చేసిందని భారత విదేశాంగ శాఖ అభిప్రాయపడింది. ఈమేరకు రక్షణశాఖ మంత్రి రాజనాథ్‌సింగ్, హోంమంత్రి అమిత్‌షా త్రివిధ దళాలు, కేంద్రబలగాల ఉన్నతాధికారులతో సమావేశమై పాక్ సరిహద్దుల్లో ప్రస్తుత పరిస్థితిని సమీక్షించారు. ఇక సౌదీ అరేబియా పర్యటనను అర్థాంతరంగా ముగించుకుని భారత్ తిరిగొచ్చిన ప్రధాని మోదీ కేంద్ర భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశం నిర్వహించి పాకిస్థాన్‌పై పలు ఆంక్షలు విధించారు. 1960లో రూపొందించుకున్న సింధూ జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. భారత్, పాకిస్థాన్‌లకు అత్యంత ముఖ్యమైన అటారీ చెక్‌పోస్టును మూసివేస్తున్నట్లు వెల్లడించారు. వివిధ కారణాలతో భారత్‌లో ఉన్న పాకిస్థాన్ పౌరులు 48గంటల్లో దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశాలు జారీచేశారు. భారత్‌లోని పాకిస్థాన్ రాయభార కార్యాలయంలోని సిబ్బంది వారంరోజుల్లో దేశం విడిచిపెట్టి వెళ్లిపోవాలని అల్టిమేటం ఇచ్చారు. అలాగే సార్క్ వీసా నిబంధనలను భారత్ కఠినతరం చేసింది. ఈ వీసా ద్వారా భారత్‌కు వచ్చిన పాకిస్తానీయులు మే1 లోపు వారి దేశం వెళ్లిపోవాలని.. లేకుంటే చర్యలు తప్పవని తేల్చిచెప్పింది. ఇక ముష్కరుల ఆచూకీ చెబితే రూ.20 లక్షల ప్రోత్సాహం అందిస్తామని కాశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా పోలీసులు ఎక్స్ వేదికగా ప్రకటించారు. ఇక దాడికి పాల్పడినట్లు ప్రకటించుకున్న లష్కరే తొయిబా తోక సంస్థ టీఆర్ఎఫ్ సభ్యులను తుదముట్టిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

### మరోసారి సర్జికల్ స్ట్రైక్స్..?

గతంలో కాశ్మీర్‌లోని ఉరి, పుల్వామా ఉగ్రదాడి అనంతరం భారత వైమానిక దళం పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలపై మెరుపుదాడికి పాల్పడడం అప్పట్లో పెను సంచలనం కలిగించింది. ఈ దాడి ఫలితంగా పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలకు భారీ నష్టం వాటిల్లిందనే వార్తలు వచ్చాయి. ఇప్పుడు మరోసారి అలాంటి దాడికే భారత్ పాల్పడే అవకాశం ఉందని పాకిస్థాన్ భయపడినట్లు సమాచారం. దీంతో తమ యుద్ధ విమానాలను, సైనికులను రక్షించుకునేందుకు భారత్ సరిహద్దుల్లో హై అలెర్ట్ ప్రకటించిందని, కొన్ని యుద్ధ విమానాలను కరాచీ, రావల్పిండి వంటి ప్రాంతాలను తరలించినట్లు తెలుస్తోంది. ఏదేమైనా పాకిస్థాన్‌కు తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని ప్రతిఒక్క భారతీయుడు ముక్తకంఠంతో నినదిస్తున్నారు. ముష్కరుల పీచమణిచేందుకు ఇంతకుమించిన సందర్భం అవసరం లేదని, అగ్రరాజ్యం అమెరికా ఐక్యరాజ్యసమితిలో శాశ్వత సభ్యదేశాలైన బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా ఇప్పటికే భారత్‌కు తమ మద్దతు ప్రకటించాయని, పాకిస్థాన్‌కు దెబ్బతగలకుండా ఎప్పుడూ సన్నాయినొక్కులు నొక్కే జిత్తుల మారి చైనా కూడా ఈ సందర్భంలో మిన్నకుండిపోవడం తప్ప మరో మాట మాట్లాడే పరిస్థితి ఉండదని విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు. దీంతో భారత్ తప్పకుండా త్వరలోనే పాక్‌కి బుద్ధిచెప్పడం ఖాయంగా కనిపిస్తోంది.

### పాకిస్థాన్.. పాపిస్థాన్ ఎలా అయ్యిందంటే..

పాకిస్థాన్. ఈ మాటకు పవిత్రభూమి అని అర్థం. భారత్‌లో ఒకప్పుడు ఇది అంతర్భాగంగా ఉండేది. మానససరోవరం సమీపంలో పుట్టే సింధూనదికి ఉపనదులైన జీలం, చీనాబ్, రావి, సట్లేజ్, బియాస్ వంటి పంచనదుల సంగమక్షేత్రంగా అప్పట్లో దీనికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. భారతదేశంలో తొలి మానవజాతిగా గుర్తింపు పొందిన ద్రవిడ నాగరికత సింధూనది పరివాహక ప్రాంతంలోనే విలసిల్లింది. ఆ కాలంలో ప్రజలు పశుపతి పేరుతో శివుడిని ఆరాధ్యదైవంగా కొలిచినట్లు చరిత్ర చెబుతోంది. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ ప్రదేశం స్వాతంత్ర్యం అనంతరం ముస్లిం పాలకుల వశమై, రాక్షసత్వానికి, మతఛాందస వాదానికి నిలయంగా మారింది. నిత్యం జిహాద్ పేరుతో మారణహోమం సృష్టించే ముష్కరులకు అది ఆతిథ్యం ఇచ్చే స్థాయికి దిగజారిపోయింది. తినేందుకు తిండి, కట్టుకునేందుకు బట్ట లేకున్నా, అక్కడి ప్రజల్లోనూ, పాలకుల్లోనూ వీసమెత్తు సిగ్గు, లజ్జా, రోషం అనే మాట వినిపించదు, వారి ప్రవర్తనలో అవి కనిపించవు. అందుకే ఇప్పుడు ప్రపంచదేశాలు దాన్ని పాపిస్థాన్ అని పిలుస్తున్నాయి. వారి వీసాకు ఇతర దేశాల్లో కనీసం చిత్తు కాగితానికి ఉండే విలువ కూడా లేదు. అయినా వారు తీరు మార్చుకోవడం లేదు. పైగా అమాయక ప్రజలను చెరపట్టే కలియుగ నరకాసురులుగా, నరరూప రాక్షసులుగా అక్కడి యువత మారిపోవడం ఆ దేశ పతనావస్థకు పరాకాష్టగా కనిపిస్తోంది. ఇప్పటికైనా పాకిస్థాన్ పాలకులు తీరుమార్చుకోకుంటే వారి దేశ భవిష్యత్ అగమ్యగోచరమే అనే వాదనలు వినిపిస్తున్నాయి...!




MJF Ln. నాదెళ్ళ వెంకటరమణయ్య

**ఉత్తరక్రియలు**

మా ఇంటి దైవం, మా తండ్రి

**శ్రీ నాదెళ్ళ వెంకట రమణయ్య గారు**

తేది 19-04-2025 శనివారం సాయంత్రం స్వర్గస్తులైనారు.

వారి **ఉత్తరక్రియలు :**

15వ రోజు తేది 3-5-2025 శనివారం శిలాద్వాసన

16వ రోజు తేది 4-5-2025 ఆదివారం పాత్తర్లు, సపిండీకరణ

17వ రోజు తేది 5-5-2025 సోమవారం వైకుంఠ సమారాధన

పంక్తి : మధ్యాహ్నం 12.00 గంటలకు

నెల్లూరు, సండేమార్కెట్ దగ్గర, ACN బిల్డింగ్ ప్రక్కనగల మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

**వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...**

కుమారులు:

నాదెళ్ళ కృష్ణ ప్రసాద్

నాదెళ్ళ సురేష్‌కుమార్ SVR Samsung Digital Plaza

నాదెళ్ళ మురళీకృష్ణ SVR Samsung Digital Plaza

## సమన్వయంతో..
# సమస్యలను పరిష్కరించండి

### అధికారులకు జిల్లా ప్రత్యేక అధికారి డా. యువరాజ్ సూచన

జిల్లాలో ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారం విషయంలో అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని, వినూత్న ఆలోచనలు, టీమ్‌వర్క్‌తో జిల్లా అభివృద్ధికి బాటలు వేయాలని జిల్లా ప్రత్యేక అధికారి.. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖల కార్యదర్శి డా.ఎన్ యువరాజ్ చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో పాటు జిల్లా అధికారుల సమావేశంలో పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన ద్వారా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. జిల్లాలోని అధికారులతో స్ట్రాటజిక్ కోర్ గ్రూప్‌ను తయారుచేసి ప్రజావసరాలను తెలుసుకొని, అందుబాటులో ఉన్న వనరులతో జిల్లాను అన్ని రంగాల్లో అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు అధికారులు పాటుపడాలని చెప్పారు. పర్యాటక పరంగా జిల్లాను అభివృద్ధి చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీ లించాలన్నారు. జిల్లాలోని పుణ్యక్షేత్రాలు, బీచ్, ఇతర ప్రముఖ ప్రాంతాలను అనుసంధానం చేస్తూ టూరిజం ప్యాకేజీ నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. నేటి యువత ట్రెక్కింగ్ చేసేందుకు ఆసక్తిగా ఉన్న దృష్ట్యా, అటవీ ప్రాంతంలో ట్రెక్కింగ్‌కు ఉన్న అవ కాశాలను పరిశీలించాలన్నారు. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, డిఆర్‌ఓ ఉదయభాస్కరరావు, ఆర్డీవోలు అనూష, వంశీకృష్ణ, పావని తదితరులు పాల్గొన్నారు.

## సాహితీ యోధునికి అక్షర నివాళి



గుండె గాయం చేసి
ఆయనలా వెళ్లిపోయాడు చూడు
దోసిళ్లతో ఆత్మీయతను పంచి
చిరునగవుల తోరణాలతో అలంకరించి
తెలుగు కవితామతల్లి నుదుటి
కుంకుమై నిలచినవాడు
ప్రతివేదికను పలుకరించి
ప్రతి వేడుకను అలంకరించిన
సింహపురి తెలుగు సాహితీవిభుడు
సెలవంటూ అర్థాంతరంగా వెళ్ళిపోయాడు
భేషజం లేని వ్యక్తిత్వం
అతిథిగానైనా ప్రేక్షకుడిగానైనా ఒదిగే
అద్వితీయ మనస్తత్వం ఎందరికుంటుంది
అందుకేనేమో ఆయన అలుపెరగని
పద్యమయ్యాడు
నెల్లూరీయుల పట్ల అవ్యాజానురాగంతో
ఉపన్యసించే వచనమయ్యాడు
ఆయనో సాహితీ భిష్ముడు
నిత్యనూతనంగా అందరి హృదయాల్లో
దివ్వెలా వెలిగే సూరీడు
ఆయన ఎక్కని 'మెట్టు' లేదు
తన ప్రసంగ గంభీరతతో తాకని అవధి లేదు
అభినవ సాహితీ కుబేరుడు
సెలవంటూ వెళ్ళిపోయాడు
ఎలా ఊరడిల్లాలి మనం
పద్యకళా పరిషత్ మనకొదలి
తాను మాత్రం పద్యమై
స్వర్గానికెగిసి అమరుడయ్యాడు
రామచంద్రుని కాలంలో జీవించడం
ఆయన అవ్యాజప్రేమను ఆస్వాదించడం
అదృష్టమే కదామరి
ఆ చిద్విలాసికి అక్షర నివాళి..
ఇక సమీకృతమై
పద్యకళాపరిషత్‌ను
విశ్వకావ్యం చేద్దాం
ప్రసాద్ ఆశయాన్ని
పరిపుష్టం గావిద్దాం!



**చిన్ని నారాయణరావు**
94402 02942

## ఉగ్రవాదుల వెన్నులో..
# వణుకుపుట్టేలా సమాధానం ఉండాలి

### - టీడీపీ నేత సోమిరెడ్డి ఆగ్రహం



కశ్మీర్‌లోని పెహల్గాం ఘటన మనస్సును కలచి వేస్తోందని, ఉగ్రవాదుల దాడుల్లో 28 మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని, మరోసారి ఇలాంటి దుర్మార్గాలు జరగకుండా ఉగ్రవాదుల వెన్నులో వణుకు పుట్టేలా ప్రభుత్వం వారికి బదులివ్వాలని మాజీమంత్రి, టీడీపీ నేత.. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. అందాల కాశ్మీర్‌లో పట్టపగలు ఉగ్రవాదులు జరిపిన మారణకాండ దారుణమని, అమాయకుల ప్రాణాలను ముష్కరమూక బలి తీసుకోవడం దుర్మార్గమని ఆయన అన్నారు. భార్యా పిల్లల ఎదుటే ఉగ్రవాదులు అత్యంత క్రూరంగా కాల్పులకు తెగబడడంతో ఆ కుటుంబాలు వణికిపోతున్నాయన్నారు. ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోకుంటే.. ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతూనే వుంటాయని, కేంద్రం ఉగ్రవాదాన్ని సమూలంగా అణచివేయాలన్నారు. ఉగ్రదాడికి బలైపోయిన వారిలో ఇద్దరు తెలుగు వ్యక్తులు ఉండటం బాధాకరమన్నారు. ఈ దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన భగవంతుడిని ప్రార్థించారు.

# ఆ ముష్కరులను ఉరి తీయాలి

### - ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



కశ్మీర్‌లో ఉగ్రవాదులు అమాయకులైన పర్యాటకులపై దాడిచేసి చంపడం దారుణమని, ఆ ఉగ్ర ముష్కరులను ఉరితీయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కశ్మీర్‌లోని పహల్గామ్‌లో మంగళవారం జరిగిన ఉగ్రవాద దాడిని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఒక ప్రకటనలో ఖండించారు. పర్యాటకుల ప్రాణాలు బలిగొన్న ముష్కరమూకలను ఏరి పారేయాలన్నారు. పహల్‌గామ్‌లో ట్రెక్కింగ్‌కు వెళ్లిన టూరిస్టులపై అమానుషంగా కాల్పులు జరిపి చంపడం తనను తీవ్రంగా కలచి వేసిందన్నారు. ఉగ్రదాడిలో అశువులు బాసిన వారి కుటుంబసభ్యులకు ఆమె తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతులకు నివాళి అర్పిస్తున్నామన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆమె భగవంతుడిని ప్రార్థించారు. ప్రశాంతంగా ఉన్న కశ్మీర్‌లో మారణహోమానికి పాల్పడ్డ ఉగ్రవాదులకు భారత భద్రతా బలగాలు త్వరలోనే తగిన గుణపాఠం చెబుతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఉగ్రవాదంపై కలసికట్టుగా పోరాడాలి

### - డీసీసీ నేత చేవూరు పిలుపు



జమ్ము కాశ్మీర్‌లోని పెహల్గాంలో పర్యాటకులపై మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఉగ్రదాడి పిరికిపందల చర్య అని, ఈ దాడిలో 28మంది చనిపోవడం, మరికొంత మంది గాయపడటం తమను తీవ్రంగా కలిచివేసిందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ దాడిలో మరణించిన వాళ్లలో ముగ్గురు తెలుగువాళ్లు ఉండటం బాధాకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మృతుల కుటుంబాలకు అన్నివిధాలుగా అండగా నిలవాలని విజ్ఞప్తిచేశారు. ఉగ్రవాదంపై పోరుకు యావత్ దేశం కలిసి కట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా, అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కార్యకర్తలతో..నేదురుమల్లి భేటీ



వెంకటగిరి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం వాకాడులోని తమ నివాసంలో వైకాపా కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ప్రస్తుత రాజకీయాలను చర్చించారు. పార్టీ బలోపేతం అయ్యేందుకు అందరూ కలసికట్టుగా కృషిచేయాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వాకాడు, చిట్టమూరు, కోట మండలాలకు చెందిన వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సూచనల మేరకు పార్టీ అభివృద్ధికి అందరూ పాటుపడాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

## టూకీగా...



### ముసునూరువారిపాలెంలో రైతులకు అవగాహన

ముత్తుకూరు మండలం ముసునూరువారిపాలెంలో ఈనెల 21న రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కలిగించారు. శాస్త్రవేత్తలు శివజ్యోతి, అనూషలు పాల్గొని, రైతులు పంటపొలాల్లో భూసార పరీక్షలు చేయించుకుని పరిపుష్టం చేసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారిణి జ్యోత్స్నరాణి, సాగునీటి సంఘం అధ్యక్షుడు ముసునూరు రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కందుకూరులో డ్రెయిన్ పనులకు శంకుస్థాపన

కందుకూరులోని గాయత్రినగర్‌లో రూ. 10లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్ నిర్మాణానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఈనెల 21న శంకుస్థాపన చేశారు. మునిసిపల్ ఇంజనీర్ గణపతి, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, మాల్యాద్రి, శ్రీనివాసరావు, సుబ్బారావు, మల్లికార్జున, మాలకొండయ్య, రామకోటయ్య, వేణు, శ్రీహరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

### దామరమడుగులో.. స్కౌట్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

బుచ్చిరెడ్డిపాలెం మండలం దామరమడుగు జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కౌట్ అండ్ గైడ్స్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు స్కౌట్స్ అండ్ గౌడ్స్ జిల్లా సెక్రటరీ రామ్‌కుమార్, జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ శాంతకుమారి చేతులమీదుగా ఈనెల 21న ప్రశంసాపత్రాలు అందజేశారు. స్కౌట్‌మాస్టర్ కృష్ణకుమార్, హెడ్మాస్టర్ నరసయ్య పాల్గొన్నారు.

### మనుబోలులో పౌష్టికాహార పక్షోత్సవాలు

మనుబోలులోని కోదండరామాపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఈనెల 21న పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించి, ప్రతి నెలా ఆరోగ్యపరీక్షలు చేయించుకోవాలని, పౌష్టికాహారం తినాలని గర్భిణులకు సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు విజయమ్మ, సుగుణమ్మ, శ్రీలక్ష్మి, మునెమ్మ పాల్గొన్నారు.

### అప్పసముద్రం పాఠశాల తనిఖీ

ఉదయగిరి మండలం అప్పసముద్రం గ్రామంలోని పాఠశాలను ఈనెల 21న ఎంఇఓ తోట శ్రీనివాసులు తనిఖీ చేశారు. విద్యార్థులకు మంచి బోధనను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ వేసవి సెలవుల్లో విద్యార్థులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### చిత్తలూరులో.. యుటిఎఫ్ ఇంటింటి ప్రచారం

తల్లితండ్రులు తమ పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలంటూ చేజర్ల మండలంలోని చిత్తలూరులో ఈనెల 21న యుటిఎఫ్ నాయకులు మాదాల రవిబాబు, రమణయ్య, శ్రీనివాసులురెడ్డి తదితరులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్యతో పాటు, ప్రభుత్వ పథకాలు కూడా అందుతాయని చెప్పారు.

### బుచ్చి ఎంపీడీఓ కార్యాలయం వద్ద చలివేంద్రం

బుచ్చిరెడ్డిపాలెం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీడీఓ శ్రీహరి ఆధ్వర్యంలో ఈనెల 21న చలివేంద్రం ఏర్పాటుచేశారు. ఎండలు మండిపోతున్న నేటి వేసవికాలంలో కార్యాలయానికి వచ్చేవారి దాహార్తి తీర్చేందుకు దీనిని ప్రారంభించామరు.

### తాటిపర్తి పాఠశాల వార్షికోత్సవం

పొదలకూరు మండలం తాటిపర్తిలోని పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఈనెల 21న ఘనంగా జరిగాయి. ప్రతిభ కలిగిన పిల్లలకు తాటిపర్తి రాఘవేంద్ర, రంగయ్యలు వారి తల్లితండ్రుల జ్ఞాపకార్థం నగదు బహుమతులు అందజేశారు. ఎంఇఓ శోభనాద్రి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగ మోహన్‌రెడ్డి, యుటిఎఫ్ నాయకుడు కల్యాణ్ పాల్గొన్నారు.

### వెంకటాచలంలో ప్రకృతి వ్యవసాయంపై సమీక్ష

వెంకటాచలంలో ఈనెల 21న ప్రకృతి వ్యవసాయంపై ఎంపీడీఓ కల్పన ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సహించాలని ఆమె అధికారులకు సూచించారు. డీపీఎం మాలకొండయ్య, వ్యవసాయశాఖ ఏ.డి శ్రీనివాసరాజు, ఏఓ హరికరుణాకర్‌రెడ్డి, ఏపీఎం రుక్మిణి పాల్గొన్నారు.

# కన్నీటి పర్యంతమైన కావలి!





**కావలి పట్టణం కన్నీటి పర్యంతమయ్యింది. కశ్మీర్ ఉగ్ర దాడిలో అశువులు బాసిన యువ ఇంజనీర్ మధుసూదన్ పార్థివ దేహం రాకతో పట్టణమంతా విషాద ఛాయలు అలముకున్నాయి. అభాగ్యులైన తల్లితండ్రులని ఆనాథలు చేసి వెళ్ళిపోయిన మధుసూదన్‌కి కడసారి కన్నీటి వీడ్కోలు పలక డానికి కావలి పౌరసమాజం మొత్తం తరలిపోయింది. మధుసూదన్ ఇంట్లో హృదయ విదారక సన్నివేశాలు చూసి కదలి పోయింది. మధుసూదన్ కుటుంబాన్ని చూసి చలించిపోయింది.**



ఈనెల 24వతేదీ సాయంత్రం 4 గంటల సమయంలో అశ్రునయనాల మధ్య జరిగిన మధుసూదన్ అంతిమయాత్రలో వేలాదిమంది ప్రజలు, అనేకమంది ప్రముఖులు, పాల్గొని మధుసూదన్‌కి కడసారి కన్నీటి నివాళులర్పించారు. మధుసూదన్ కుటుంబానికి ప్రభుత్వంతో పాటు మేమంతా అండగా వున్నాం అని చెప్పడానికి ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, దేవాదాయ ధర్మాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్, కావలి శాసన సభ్యుడు కావ్య కృష్ణారెడ్డి, సర్వేపల్లి శాసన సభ్యుడు.. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి స్వయంగా అంత్యక్రియలలో పాల్గొని భరోసా కల్పించారు. నాన్నని కోల్పోయి దిక్కుతోచని స్థితిలో వున్న మధుసూదన్ పిల్లలని పవన్ కళ్యాణ్ అక్కున చేర్చుకుని ఓదార్చారు. 'మేమంతా ఉన్నాం' అన్న ధైర్యాన్ని కల్పించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీతో సహా అధికార యంత్రాంగం అంత్యక్రియ ఏర్పాట్లని పర్యవేక్షించారు. మంత్రులు సత్యకుమార్, నాదెండ్ల మనోహర్ మధుసూదన్ పార్థివ దేహాన్ని తమ భుజాలపై ఎత్తుకుని 'జోహార్ మధుసూదన్' అని నినదిస్తూ జోహార్లర్పించారు.







## సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో.. వేమిరెడ్డి

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంగళవారం ఢిల్లీలో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. టీడీపీ ఎంపీలు, పలువురు కేంద్రమంత్రులను కలసిన సీఎం చంద్రబాబు.. వారితో రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రితో పాటు, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్, కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్‌లను కలిశారు. ఈ పర్యటనలో కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు కూడా ఉన్నారు.

## మంత్రి నారాయణతో..ఎమ్మెల్యే కోటంరెడ్డి భేటీ




రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డా. పొంగూరు నారాయణతో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇటీవల భేటీ అయ్యారు. నెల్లూరులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆయన్ను కలసి నెల్లూరు, నెల్లూరు రూరల్‌లలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, వాటి పురోగతిని చర్చించారు. చేపట్టదలచిన పథకాలను చర్చించుకున్నారు. శ్రీధర్‌రెడ్డి సోదరుడు గిరిధర్‌రెడ్డితో పాటు, వారి వెంట నెల్లూరు కార్పొరేషన్ ఇన్‌చార్జి నందన్ తదితరులు పాల్గొన్నారు.

# ముత్తుకూరుకు.. త్వరలోనే మహర్దశ!

## పోర్టు ప్రతినిధుల సహకారంతో అభివృద్ధి



ముత్తుకూరు పంచాయతీని మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దే బాధ్యతను ఇటీవల అదానీ కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్, అదానీ ఫౌండేషన్ చేపట్టిన సందర్భంగా, ముత్తుకూరు దశ తిరగబోతోంది. పీ4 విధానంలో భాగంగా, ముత్తుకూరు పంచాయతీ, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆ అభివృద్ధిలో భాగస్వాములు కానున్నాయి. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఛైర్మెన్ పి. కృష్ణయ్య, జిల్లా కలెక్టర్ ఆనంద్ తదితర అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో తమ నిర్ణయాన్ని పోర్టు ప్రతినిధులు ప్రకటించడం విశేషం. ఈ సందర్భంగా అదానీ కృష్ణపట్నం పోర్టులో జరిగిన సమావేశంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు అదానీకి ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచంలోని అత్యంత ధనవంతుల్లో ఒకరైన అదానీ సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తుండడం అభినందనీయమని సోమిరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. దీంతో పోర్టు పరిసర ప్రాంతాలన్నీ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతాయని, ముత్తుకూరు అభివృద్ధి బాధ్యతను అదానీ ప్రతినిధులు చేపట్టడం హర్షదాయకమని అన్నారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ, ముత్తుకూరు అభివృద్ధి బాధ్యతను అదానీ చేపట్టడం మంచి ఆలోచన అని, అందుకు ప్రభుత్వపరంగా సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు, పబ్లిక్ భాగస్వామ్యంలో ఇలాంటి కార్యక్రమాలు జరిగినప్పుడు మంచి ఫలితాలు వస్తాయన్నారు. పరిశ్రమల ప్రతినిధులు తమ కార్పొరేట్ సామాజిక సేవలో భాగంగా, పోర్టు సమీపంలోని గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని సూచించారు. పీ4 కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత కార్యక్రమానికి అందరూ సహకరించాలని, త్వరలోనే సుందరమైన ముత్తుకూరు సాధ్యమవుతుందని ఏపీపీసీబీ ఛైర్మెన్ కృష్ణయ్య ఆకాంక్షించారు. పోర్టు సీఇఓ జగదీష్ పటేల్, పీఆర్ఓ వేణుగోపాల్, కేఎం రామ్ (కార్పొరేట్ ఎఫైర్స్‌హెడ్), రాజేష్‌రంజన్ (సీఎస్ఆర్ హెడ్)లు మాట్లాడుతూ, ముత్తుకూరును కాన్పూర్ మోడల్‌లో తీర్చిదిద్దుతామన్నారు. ఆర్డీఓ నాగఅనూష, డ్వామా పీడీ గంగాభవాని, తహసీల్దార్ స్వప్న, ఎంపీడీఓ నాగమణి, పోర్టు ప్రతినిధులు పాల్గొన్నారు.



Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com